విశాఖపట్టణం
బుధవారం 18 ఫిబ్రవరి 2026

For a pure tomorrow..

జయ జయహే

jayajayahey.in సంపుటి: 9 సంచిక: 25 వెల: రూ.5/- పేజీలు: 8


Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


# ఏప్రిల్‌లో ఎన్నికలు

తమిళనాడు, బెంగాల్, కేరళ, అసోం, పుదుచ్చేరి ఎలక్షన్స్

మార్చి రెండు లేదా మూడో వారంలో నోటిఫికేషన్

2



### మరో రెండు పథకాలు

# వచ్చే నెలలో అమలు

**మార్చి 3 నుంచి ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మీ**

**స్త్రీ నిధి బ్యాంక్ ద్వారా పావలా వడ్డీ రుణాలు**

**(అమరావతి - జయజయహే)**

ద్వాక్రా మహిళల కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతున్న విషయం తెలిసిందే. వారిని ఆర్ధికంగా బలోపేతం చేసేందుకు కూటమి సర్కార్ తోడ్పాటు అందిస్తోంది. ద్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించడంతో పాటు స్వయం ఉపాధి పొందేందుకు అనేక ప్రోత్సహకాలు అందిస్తోంది. అలాగే వీరు తయారుచేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సుదుపాయం కల్పిస్తోంది. ఈ క్రమంలో ద్వాక్రా మహిళల కోసం త్వరలో మరో రెండు కొత్త పథకాలను ప్రవేశపెట్టేందుకు చంద్రబాబు సర్కార్ సిద్ధమైంది. మార్చి 8వ తేదీన మహిళా దినోత్సవం వస్తుంది. ఈ సందర్భంగా రెండు పథకాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతన్నాయి. అసలు ఈ పథకాలు ఏంటి..? మహిళలకు ఎలాంటి లబ్ది జరగనుంది? అనే విషయాలు ఒకసారి చూద్దాం. ద్వాక్రా మహిళల కోసం ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, ఎన్టీఆర్ కళ్యాణ లక్ష్మి పథకాలను ప్రభుత్వం మార్చి 3న ప్రారంభించనుంది. ఆ రోజు మహిళా దినోత్సవం కాకుండా గ్రామీణ పేదరిక నిర్మూలన ..మిగతా 2లో

# ఏఐ సూపర్ పవర్ భారత్


**మానవ సామార్థ్యాలకు సవాల్**


**2047 నాటికి అగ్రగామి**

**కృత్రిమ మేథపై మానవ పరిశీలన అవసరం**

**ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యలు**

**ఏఐ సమ్మిట్‌లో కీలక ఉపన్యాసం**







**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

భారతదేశ కృత్రిమ మేధస్సు భవిష్యత్తు కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక ప్రతిష్టాత్మకమైన రోడ్‌మ్యాప్‌ను రూపొందించారు. 2047 నాటికి దేశం ప్రపంచంలోని మూడు అగ్రశ్రేణి ఏఐ సూపర్ పవర్‌లలో ఒకటిగా ఉండాలని ప్రకటించారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సమ్మిట్ ఫిబ్రవరి 16 నుంచి 20 వరకు జరుగుతుంది. ఇందులో ప్రపంచవ్యాప్తంగా ఉన్న టెక్ నాయకులు పాల్గొంటున్నారు. ఇందులో ఏఐ సానుకూల, ప్రతికూల ప్రభావాలను చర్చించనున్నారు. దీంతో పాటు, అనేక స్టార్టప్‌లు కూడా తమ ఏఐ ఉత్పత్తులను ఇందులో ప్రదర్శించాయి. న్యూఢిల్లీలో జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, నేడు, ఏఐ నాగరికత మార్పు దశలో ఉందని ప్రధాని మోదీ అన్నారు. ఇది గతంలో ఎన్నడూ లేని విధంగా మానవ సామర్థ్యాలను పెంచగలదు, కానీ మార్గదర్శకత్వం లేకుండా వదిలేస్తే, అది ప్రస్తుత సామాజిక పునాదులను పరీక్షించగలదు. దాని అర్థవంతమైన, సానుకూల అంశాలను చర్చించడానికి ఈ శిఖరాగ్ర సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. భారత్ నిష్క్రియాత్మక వినియోగదారుగా ఉండదని, ..మిగతా 2లో

# కొత్తగా 9 ఎయిర్ పోర్టులు

**ఇప్పటికే ఆరు విమానశ్రయాలు.. కనెక్టవిటీ పెంచేందుకు ప్రతిపాదనలు**



**(అమరావతి - జయజయహే)**

కూటమి సర్కార్ ప్రజా రవాణా, సరకు రవాణాను రాష్ట్రంలో మెరుగుపర్చేందుకు ప్రయత్నిస్తోంది. ప్రయాణాన్ని వేగవంతం చేయడం, సరుకు రవాణాలో వేగం పెంచేందుకు ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా రాష్ట్రంలో కొత్త ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి శ్రీకారం చుడుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఆరు ఎయిర్‌పోర్ట్‌లు ఉండగా.. ఈ ఏడాదిలో మరో ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తుంది. దీంతో మొత్తం ఏడు ఎయిర్‌పోర్ట్‌లు ఉండనున్నాయి. అయితే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు విమాన కనెక్టివిటీని తెచ్చేందుకు మరో 9 ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్ర సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఈ మేరకు ప్లాన్లు రూపొందిస్తోంది. ఇందుకోసం రూ.6,417 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేసింది. మరో 9 కొత్త ఎయిర్‌పోర్ట్‌లకు ప్రణాళికలు రూపొందించారు. వీటి కోసం రూ.6,417 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వంతో భాగస్వామ్యమై వీటిని ..మిగతా 2లో



# 4 వారాల్లో లొంగిపోవాలి

**సిద్ధార్థరెడ్డి బెయిల్ పిటీషన్ కొట్టివేత**

**సినీనటి ప్రత్యూష హత్య కేసులో సుప్రీం వ్యాఖ్యలు**

**హైకోర్టు తీర్పును సమర్థించిన న్యాయస్థానం**

2

# డా.నమ్రతను కస్టడీకి ఇవ్వండి

**ఐదు రోజుల పాటు విచారణ చేయాలి**

**స్పెషల్ కోర్టులో ఈడీ పిటీషన్**




**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

సరోగసీ పేరుతో అక్రమాలకు పాల్పడిన కేసులో అరెస్టైన డాక్టర్ నమ్రతపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. సృష్టి సరోగసీ కేసులో భాగంగా డాక్టర్ నమ్రతను ఐదు రోజుల పాటు కస్టడీకి అప్పగించాలని కోరుతూ మంగళవారం ఈడీ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసులో కోట్ల రూపాయల హవాలా లావాదేవీలు, మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ విచారణలో బయటపడినట్లు అధికారులు తెలిపారు. అక్రమంగా సరోగసీ సేవలు నిర్వహిస్తూ భారీ ..మిగతా 2లో


# ఐఏఎస్ శ్రీలక్ష్మీకి చుక్కెదురు

**డిశ్చార్జి పిటీషన్ కొట్టివేత**

**ఓఎంసీ మైనింగ్‌లో సీబీఐ కౌంటర్**

**(హైదరాబాద్ - జయజయహే)**

జగన్ అక్రమాస్తులతో పాటు గాలిజనార్ధన్‌రెడ్డికి చెందిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి గనుల కేటాయింపు కేసుల్లో సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ రెండు కేసుల నుంచి తనను తప్పించాలంటూ శ్రీలక్ష్మి దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌ను కొట్టేస్తూ తెలంగాణ హైకోర్ట్ గతంలో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి నిబంధనలకు అనుగుణంగానే గనులు కేటాయించినట్లు శ్రీలక్ష్మి వివరణ ఇచ్చుకోగా గనులశాఖ కార్యదర్శిగా అనేక ఉల్లంఘనలకు పాల్పడినట్లు సీబీఐ కౌంటర్ ఇచ్చింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి అక్రమంగా గనులు కేటాయించడంలో శ్రీలక్ష్మి కీలకంగా వ్యవహరించారని, క్యాప్టివ్ మైనింగ్ అనే పదాన్ని తొలగించి అక్రమాలకు ఆమే బాటలు వేశారని సీబీఐ స్పష్టం చేసింది. పదవిలో ఉన్నంతకాలం శ్రీలక్ష్మి భారీగా అక్రమాస్తులు కూడబెట్టుకున్నారని వివరించింది. ఆ సమయంలో శ్రీలక్ష్మి మరిది భారీగా అక్రమాస్తులు సంపాదించారని సీబీఐ వెల్లడించింది. గనులు కేటాయించేందుకు శ్రీలక్ష్మి లంచం కూడా డిమాండ్ చేసినట్టు సాక్షులు వాంగ్మూలం ఇచ్చారని



కోర్టుకు తెలిపిన సీబీఐ ఆమె అక్రమాలన్నీ విచారణలోనే తెలుతాయన్నారు. సీబీఐ వాదనల్ని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు శ్రీలక్ష్మి వేసిన డిశ్చార్జి పిటిషన్‌ను కొట్టేసింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సమర్థించింది. వేరే కేసుగా భావించి ఇందులో తొలుత స్టే ఇచ్చామని, ఇప్పుడు ఆ పొరపాటును సవరిస్తున్నామని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుందరేశ్ అన్నారు. పొరపాటుగా ఇచ్చిన ..మిగతా 2లో



# డా.గజల్‌కు స్వర్ణ కంకణ ప్రదానం

**విజయవాడ: జయ జయహే**

శ్రీ కృష్ణ దేవరాయ జయంతి సందర్భంగా తెలుగు భాషకు చేస్తున్న విశిష్ఠ సేవలకు గాను ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు, ప్రఖ్యాత గజల్ గాయకుడు డా..గజల్ శ్రీనివాస్ ను ఎమ్.ఎస్. బాల సుబ్రహ్మణ్యం కళా సంస్థ కె.వి. బ్రహ్మానందం, తెలుగు కళా వాహిని సంస్థలు సంయుక్తంగా విజయవాడ కౌతా పూర్ణానంద హాలులో శ్రీ కృష్ణ దేవ రాయ పురస్కారం - స్వర్ణ కంకణ ప్రదానం తో ఘనం గా సత్కరించాయి. విశ్వ గజల్ గాయక సార్వ భౌమ అన్న బిరుదును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు గా గోళ్ల నారాయణ రావు, విశిష్ఠ అతిథులుగా ఆంధ్ర ప్రదేశ్ నాటక అకాడమీ అధ్యక్షులు గుమ్మడి గోపాల కృష్ణ, రోటరీ పూర్వ గవర్నర్ ఎమ్. సి.దాసు, ప్రముఖ రచయిత రసరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్‌లో ఎన్నికలు

## తమిళనాడు, బెంగాళ్, కేరళ, అసోం, పుదుచ్చేరి ఎలక్షన్స్

## మార్చి రెండు లేదా మూడో వారంలో నోటిఫికేషన్

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

తమిళనాడు, బంగాల్, కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్‌లో వివిధ తేదీల్లో జరగనున్నట్లు తెలిసింది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం మార్చి రెండు లేదా మూడో వారంలో నోటిఫికేషన్ ఇవ్వనుందని అధికారిక వర్గాలు తెలిపాయి. అయితే, తమిళనాడు, అసోం, కేరళ, బంగాల్ అసెంబ్లీ గడువు మే నెలలో ముగియనుంది. అదేవిధంగా, పుదుచ్చేరి అసెంబ్లీ గడువు కూడా జూన్ 15 నాటికి ముగియనుంది. ఈ నేపథ్యంలో ఈసీ అధికారులు ఇప్పటికే ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో పర్యటిస్తూ ఏర్పాట్లపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బంగాల్‌లో అత్యధికంగా ఎనిమిది దశల్లో పోలింగ్ నిర్వహించారు. అదేవిధంగా, అసోంలో రెండు దశల్లో ఎన్నికలు జరిగాయి. తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిలో ఒకే దశలో ఎన్నికల జరిగాయి. ఇదిలా ఉండగా, ఎన్నికల జాబితాకు సంబంధించి తుది ప్రకటన ప్రక్రియ కూడా దాదాపు పూర్తైనట్లు తెలుస్తోంది. పుదుచ్చేరి ఇప్పటికే (ఫిబ్రవరి 14న) తుది ఓటరు జాబితాను విడుదల చేసింది. మరోవైపు, తమిళనాడు కూడా త్వరలో తుది జాబితాను ప్రకటించనుంది. అదేవిధంగా, కేరళలో ఫిబ్రవరి 21న తుది జాబితా విడుదల కానుంది. బంగాల్‌లో ఫిబ్రవరి 28న ఓటరు జాబితా ప్రకటించనున్నారు. ఇక అసోంలో ఎస్ఐఆర్ ప్రక్రియ అనంతరం ఫిబ్రవరి 10న తుది జాబితా విడుదలైంది. మరోవైపు, అసోంలో అసెంబ్లీ ఎన్నికలను ఒకే దశలో లేదా గరిష్ఠంగా రెండు దశల్లో ఎన్నికలు నిర్వహించాలని స్థానిక రాజకీయ పార్టీలు ఈసీని కోరాయి. ఏప్రిల్ 14న బిహు పండుగ రావడంతో దాన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల తేదీలు నిర్ణయించాలని కూడా విజ్ఞప్తి చేశాయి. ఇదిలా ఉండగా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలోని పూర్తి స్థాయి కమిషన్ బృందం అసోంలో ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహిస్తోంది.

**ఈసీపై మమతా ఆరోపణలు!**

ఇదిలా ఉండగా, బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మంగళవారం ఈసీపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల కమిషన్ "తుగ్లకీ కమిషన్" లాగా ప్రవర్తిస్తోందని విమర్శించారు. బీజేపీ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ఓటర్ల జాబితాలను తారుమారు చేసేలా ఈసీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ మేరకు సీఎం మమతా విలేకరులతో మాట్లాడారు. ఈసీ నిబంధనలను ఉల్లంఘిస్తోందని, సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తుందని, గందరగోళ వాతావరణాన్ని సృష్టిస్తోందని ఆరోపించారు. "ఈసీ బంగాల్‌లో ఓటర్లను టార్చర్ చేస్తోంది. వారు దిల్లీ సుల్తాన్ మహ్మద్ బిన్ తుగ్లక్ లాగా ప్రవర్తిస్తున్నారు. అలాగే, జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్ లాగా దారుణాలకు పాల్పడుతున్నారు. నా ప్రశ్న ఏమిటంటే ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారా, లేదా రాజకీయ పార్టీ తరపున పనిచేసే తుగ్లక్ కమిషన్నా? ఇప్పటికే హరియాణా, బిహార్, మహారాష్ట్రల్లో ఫిర్యాదులు వచ్చాయి. అప్పుడు బంగాల్‌ను ఎందుకు లక్ష్యంగా చేసుకుంటున్నారు? బీజేపీని సంతోషపెట్టడానికే ఈసీ ఇదంతా చేస్తోంది" అని బెనర్జీ ఆరోపించారు. రాష్ట్రం నుంచి నియమించిన ఏడుగురు అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను సస్పెండ్ చేయడంపై మమతా ప్రశ్నించారు. అధికారులకు విచారణ లేదా షో-కాజ్ నోటీసులు ఎందుకు ఇవ్వలేదని అడిగారు. వారిలో కొందరు ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా అమలు చేయడానికి కృషి చేశారన్నారు. ఇవి ముమ్మాటికీ ప్రతీకార చర్యలేనన్నారు. తాము ప్రజల, అధికారుల వెంటే ఉన్నామని, ఎప్పటికీ వారితోనే ఉంటామని ఆమె పేర్కొన్నారు. బంగాల్ ప్రభుత్వ అధికారులను బాధితులుగా చేస్తే, 100 శాతం వారిని రక్షిస్తామని తెలిపారు. అదేవిధంగా, రాష్ట్రంలో 160 మంది మరణాలకు ఎస్ఐఆర్ పని ఒత్తిడి కూడా కారణమని ఆమె ఆరోపించారు. మరోవైపు, తన నియోజకవర్గం భోవానిపుర్‌లో రెండు లక్షలకు పైగా ఓటర్లలో 40,000 మంది ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయని వ్యాఖ్యానించారు.

# మరో రెండు పథకాలు వచ్చే నెలలో అమలు

మొదటి పేజీ తరువాయి...

సొసైటీ ఏర్పాటై 25 ఏళ్లు పూర్తవుతుంది. దీనిని పురస్కరించుకుని ఈ పథకాలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ పథకాల్లో భాగంగా డ్వాక్రా మహిళల కుటుంబాల్లోని పిల్లల చదువులు, వివాహాలకు స్త్రీ నిధి బ్యాంక్ ద్వారా రూ.లక్ష వరకు రుణం అందిస్తారు. కేవలం పావలా వడ్డీతో ఈ రుణాలు మంజూరు చేయనున్నారు. వీటిని ఈఎంఐ రూపంలో చెల్లించవచ్చు. 48 వాయిదాల్లో వీటిని చెల్లించాల్సి ఉంటుంది. ఈ లోన్ పొందేందుకు పెద్దగా డాక్యుమెంట్స్ కూడా అవసరం లేదు. పెళ్లికి లోన్ పొందేందుకు కేవలం లగ్న పత్రిక, పెళ్లి ఖర్చు అంచనాను సమర్పిస్తే సరిపోతుంది. అనంతరం వెంటనే బ్యాంక్ అకౌంట్లో డబ్బులు జమ చేస్తారు. ఈ రెండు పథకాల అమలుకు రూ.2 వేల కోట్ల వరకు ఖర్చు అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది.

**అర్హులు ఎవరంటే..?**

ఈ పథకాల ద్వారా లబ్ది పొందాలంటే డ్వాక్రా గ్రూపులో సభ్యురాలు అయి ఉండాలి. ఇక కనీసం ఆరు నెలల పాటు డ్వాక్రా గ్రూపులో సభ్యురాలుగా కొనసాగి ఉండాలి. అలాగే బయోమెట్రిక్ డీటైల్స్ ఆధారంగా ఈ పథకాలు అమలు చేస్తారు. మార్చి 3న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ పథకాలు ప్రారంభం కానున్నాయి. గతంలోనే ఈ పథకాలను ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ.. కొన్ని కారణాల వల్ల ప్రక్రియ నిలిపివేశారు. ఇప్పుడు మహిళా దినోత్సవం వస్తుండటంతో.. ఆ రోజు ప్రారంభిస్తే బాగుంటుందనే ఉద్దేశంతో లాంచ్ చేస్తున్నారు. అటు డ్వాక్రా మహిళల కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే అనేక పథకాలను అమలు చేస్తోంది.

# డా.నమ్రతను కస్టడీకి ఇవ్వండి

మొదటి పేజీ తరువాయి...

మొత్తంలో నిధులు అక్రమ మార్గాల్లో మళ్లించినట్లు డాక్టర్ నమ్రతపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆర్థిక లావాదేవీలు, సంబంధిత వ్యక్తుల పాత్ర, నిధుల మూలాలను పూర్తిగా వెలికితీయడానికి కస్టడీ అవసరమని ఈడీ అధికారులు కోర్టును కోరారు. ఇటీవలే ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా డాక్టర్ నమ్రతను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. సరోగసీ పేరుతో అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తూ డాక్టర్ నమ్రత భారీగా డబ్బు సేకరించి, హవాలా మార్గంలో విదేశాలకు తరలించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈడీ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై ప్రత్యేక కోర్టు రేపు (బుధవారం) విచారణ చేపట్టనుంది. ఈ విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ కేసు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించగా, సరోగసీ కేంద్రాలపై మరింత కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం.

# ఐఏఎస్ శ్రీలక్ష్మీకి చుక్కెదురు

మొదటి పేజీ తరువాయి...

స్టేను నిందితులు ఎంజాయ్ చేశారని వ్యాఖ్యానించారు. విచారణ కొనసాగించాలని ట్రయల్ కోర్టును ఆదేశించారు. మరోవైపు జగన్ అక్రమాస్తుల కేసులో భాగంగా పెన్నా సిమెంట్స్‌కు లీజుల మంజూరు చేయడంలో అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి శ్రీలక్ష్మి అధికార దుర్వినియోగం పై ఆధారాలు ఉన్నాయని సీబీఐ గతంలో స్పష్టం చేసింది. శ్రీలక్ష్మి పై కేసు కొనసాగించడానికి అన్ని ఆధారాలు సేకరించామని తెలంగాణ హైకోర్టుకు నివేదించిన విషయం తెలిసిందే. శ్రీలక్ష్మి పై కేసు కొనసాగించడానికి అన్ని ఆధారాలను సేకరించామని సీబీఐ తెలిపింది. గతంలో స్పష్టం చేసిన ఈ విషయంపై మళ్లీ పిటషన్ దాఖలు వేయడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. అనంతపురం జిల్లా యాకిడిలో 231 ఎకరాల భూ కేటాయింపు, ఉమ్మడి కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం కౌలపల్లిలో 304.70 హెక్టార్ల లీజును అంచనా వేయడంలో, రంగారెడ్డి జిల్లా తాండూరులో 822.13 ఎకరాల లీజు రెన్యువల్‌తో పాటు హైదరాబాద్‌లో పయనీర్ హోటళ్ల నిర్మాణాలకు సబ్సిడీలు అందించడంలో నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపిస్తూ సీబీఐ పెన్నా సిమెంట్స్‌కు చెందిన పెన్నా ప్రతాప్ రెడ్డిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

ఈ కేసులో నిందితురాలిగా ఉన్న అప్పటి పరిశ్రమల కార్యదర్శి వై. శ్రీలక్ష్మి తనపై ఉన్న కేసును కొట్టివేయాలని పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారణ జరపగా, సీబీఐ ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా మాట్లాడుతూ, శ్రీలక్ష్మి గతంలో సీబీఐ కోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకుని పిటిషన్ దాఖలు చేశారని తెలిపారు.

ఇరుపక్షాల వాదనలు పూర్తయి తీర్పును రిజర్వ్ చేసిన తర్వాత పిటిషన్‌ను ఉపసంహరించుకున్నట్లు ఆయన తెలిపారు. అంటే, అవి తుది ఆదేశాలు అని, అదే కాగ్నిజెన్స్ ఉత్తర్వులను సవాలు చేస్తూ మళ్లీ పిటిషన్ దాఖలు చేయడం ఆమోదయోగ్యం కాదని అన్నారు. ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తూ కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల పై అభ్యంతరాలు ఉంటే, వాటిని ఈ కోర్టులో కాకుండా కింది కోర్టులో తేల్చుకోవాలని అన్నారు. అందువల్ల, పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు.

# కొత్తగా 9 ఎయిర్ పోర్టులు

మొదటి పేజీ తరువాయి...

నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, తిరుపతి, కర్నూలు, కడపలో విమానాశ్రయాలు అందుబాటులో ఉండగా.. మరికొద్ది నెలల్లో భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో వీటిని నిర్మించేందుకు ప్లాన్ రూపొందించింది. ఇవి అందుబాటులోకి వస్తే రాష్ట్రంలోని ఎక్కడినుంచి ఎక్కడికైనా వెంటనే చేసుకోవచ్చు. దీని వల్ల సరుకు రవాణా పెరిగే స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

నెల్లూరు జిల్లా దగదర్తి దగ్గర ఎయిర్‌పోర్ట్ నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.916 కోట్లు అవసరమవుతుందని అంచనా వేశారు. ఇప్పటికే భూసేకరణ పనులు కూడా మొదలయ్యాయి. త్వరలోనే టెండర్లను పిలిచి పనులు ప్రారంభించనున్నారు. చిత్తూరు జల్లా కుప్పంలో ఎయిర్‌పోర్ట్ కోసం 444 ఎకరాల భూమిని సేకరించనున్నాయి. ఈ విమానాశ్రయం నిర్మాణానికి రూ.1,142 కోట్లు అవసరమవుతాయని భావించారు. రాజధాని అమరావతి, శ్రీకాకుళంలో ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి ప్లాన్ వేశారు. అమరావతి ఎయిర్‌పోర్ట్‌కు రూ.వెయ్యి కోట్లు, శ్రీకాకుళంలో విమానాశ్రయ నిర్మాణానికి రూ.650 కోట్ల వ్యయం అవ్వనుంది. కాకినాడ జిల్లా తుని-అన్నవరం మధ్య, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెం, పల్నాడు జిల్లాలోని నాగార్జున సాగర్, ప్రకాశం జిల్లా ఒంగోలు, అనంతపురం జిల్లాల్లో ఎయిర్‌పోర్టుల నిర్మాణం కోసం డీపీఆర్ రెడీ చేస్తున్నారు. ఎయిర్‌పోర్టులు అందుబాటులోకి వస్తే స్థానికంగా కొత్త పరిశ్రమలు ఏర్పాటు అవుతాయి. దీంతో వల్ల చెన్నై, బెంగళూరుకు ఇక్కడ నుంచి వేగంగా సరుకు రవాణా జరుగుతుంది. దీని వల్ల లాజిస్టిక్స్ బిజినెస్ పెరుగుతోంది. కొత్త ఉద్యోగులు కూడా దీని ద్వారా ఏర్పడతాయి. స్థానిక యువతకు దీని వల్ల లాభం జరుగుతుందని ప్రభుత్వం చెబుతోంది.

# 4 వారాల్లో లొంగిపోవాలి

## సిద్ధార్థరెడ్డి బెయిల్ పిటిషన్ కొట్టివేత

## సనీనటి ప్రత్యూష హత్య కేసులో సుప్రీం వ్యాఖ్యలు

## హైకోర్టు తీర్పును సమర్థించిన న్యాయస్థానం

**(న్యూఢిల్లీ - జయజయహే)**

ఒకప్పటి సినీనటి ప్రత్యూష మృతి కేసులో సుప్రీంకోర్టు తాజాగా సంచలన తీర్పు వెలువరించింది. ఈ క్రమంలో సుప్రీం కోర్టు నిందితుడు సిద్ధార్థరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. సిద్ధార్థరెడ్డి లొంగిపోవాలన్న సుప్రీంకోర్టు 4 వారాల సమయం ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. గతంలో తెలంగాణ హైకోర్టు ఖరారు చేసిన శిక్షను సుప్రీంకోర్టు సమర్థించింది. ఇంటర్ చదువుతున్నప్పుడు ప్రత్యూష, సిద్ధార్థరెడ్డి ప్రేమించుకున్నారు. ఇంటర్ పూర్తయ్యాక ప్రత్యూష సినిమాల్లోకి వెళ్లాక, సిద్ధార్థరెడ్డి ఇంజినీరింగ్‌లో చేరాడు. 2002 ఫిబ్రవరి 23న ఇద్దరూ విషం తాగిన పరిస్థితిలో ప్రైవేటు ఆసుపత్రిలో చేరడం అప్పట్లో కలకలం సృష్టించింది. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ 2002 ఫిబ్రవరి 24న ప్రత్యూష ప్రాణాలు విడించారు. చికిత్స తర్వాత మార్చి 9న సిద్ధార్థ రెడ్డి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. కూల్‌డ్రింక్‌లో పురుగుమందు కలిపి తాగినట్లు టెస్ట్‌లో పోలీసులు గుర్తించారు. 2002లో సినీనటి ప్రత్యూష మృతి సంచలనం సృష్టించింది. 2004లో ప్రత్యూష మృతిని పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఆత్మహత్యకు ప్రేరేపించేలా సిద్ధార్థరెడ్డి వ్యవహరించారని ట్రయల్ కోర్టు తేల్చింది. ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ట్రయల్ కోర్టు తీర్పు ఇవ్వగా నిందితుడు సిద్ధార్థ రెడ్డి హైకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై పలు దఫాల్లో విచారణ చేపట్టి హైకోర్టు 2011లో ఐదేళ్ల జైలు శిక్షను రెండేళ్లకు కుదించి, రూ.50 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. దీంతో ఆ తీర్పును సైతం సిద్ధార్థ రెడ్డి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం సమర్థించింది. ప్రత్యూష కేసులో పోస్టుమార్టం జరిగిన తీరుపై అసంతృప్తి తెలిపింది. పోస్టుమార్టం నిర్వహించిన పద్ధతి సరిగా లేదన్న ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. తెరమీద ఎంత కలర్‌ఫుల్‌గా కనిపించినా కొందరు నటీనటుల నిజజీవితాల్లోనూ చీకటి రహస్యాలు ఎన్నో ఉంటాయి! స్క్రీన్ మీద నవరసాలు పండిస్తూ ప్రేక్షకులను మెప్పించే వారి జీవితాల్లో ఎవరికీ కనిపించని విషాదగాథలు ఉంటాయి. అలాంటి కథే సినీనటి ప్రత్యూషది కూడా. తన నటనతో, హావభావాలతో, అందమైన చిరునవ్వుతో ఒకప్పుడు ఎంతో మంది అభిమానుల మనసును దోచుకుంది. మంచి సినిమా అవకాశాలతో సినీ వినీలాకాశంలో వెలుగుతున్నప్పుడే ప్రేమలో పడి ప్రాణాలు కోల్పోయింది. 1998లో 'రాయుడు' సినిమా ద్వారా సినీ రంగంలో అరంగ్రేట్రం చేసింది. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో వరుస సినిమాల్లో నటించింది. కేవలం నాలుగు సంవత్సరాల్లోనే 12 సినిమాలు నటించి మంచి గుర్తింపు సాధించింది.

# ఏఐ సూపర్ పవర్ భారత్

మొదటి పేజీ తరువాయి...

అత్యాధునిక నమూనాలు, ప్లాట్‌ఫారమ్‌ల ప్రపంచ సృష్టికర్తగా ఉద్భవిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. ఏఐ మానవ కేంద్రీకృతంగా, అందరినీ కలుపుకొని ఉండాలని స్పష్టం చేశారు. భారత్ ఏఐ నినాదం "సర్వజన్ హితాయ్, సర్వజన్ సుఖయే" (అందరికీ సంక్షేమం, అందరికీ ఆనందం) తో సమన్వయం చెందుతుందని, సాంకేతికత మానవాళికి సేవ చేసేలా చూస్తుందని ఆయన అన్నారు.

గ్లోబల్ సౌత్‌లో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ సమ్మిట్ అభివృద్ధి చెందుతున్న దేశాల గొంతులు వినిపించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఏఐ గవర్నెన్స్, సమ్మిళిత డేటాసెట్‌లు, వాతావరణ వినియోగ కేసులు, వ్యవసాయ ఉత్పాదకత, బహుభాషా ప్రాప్యత వంటి అంశాలు భారతదేశ విధానంలో కేంద్రంగా ఉన్నాయన్నారు. 2047 సంవత్సరానికి భారతదేశ అభివృద్ధి రోడ్ మ్యాప్‌తో ఏఐని నేరుగా అనుసంధానించినట్లు ప్రధానమంత్రి అన్నారు. ఏఐ ఇప్పటికే ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయాన్ని అట్టడుగు స్థాయిలో పరివర్తన చెందుతోందని ఆయన అన్నారు. జిల్లా ఆసుపత్రులలో ముందస్తు వ్యాధి గుర్తింపు కోసం తాజా పరికరాలను, స్థానిక భాషలలో వ్యక్తిగతీకరించిన అభ్యాస వేదికలను ప్రవేశపెట్టడం ద్వారా పట్టణ-గ్రామీణ అంతరాన్ని తగ్గించడంలో ఏఐ సహాయపడుతుందని ప్రధాని అన్నారు. గుజరాతీలో రియల్-టైమ్ సలహాలను అందించే ఏఐ-ఆధారిత పంట సలహా వ్యవస్థలు, మహిళా పాడి రైతు మద్దతు సాధనాల ఉదాహరణలుగా నిలిచాయని ఆయన ఇచ్చారు. కృత్రిమ మేధస్సు ప్రపంచ సమస్యలను ఎదుర్కోవడానికి, భారతదేశంలో వైవిధ్యం ఒక సవాలుతో పాటు ఒక అవకాశం కూడా అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇంగ్లీష్ లేదా పట్టణ డేటాను మాత్రమే ఉపయోగించి శిక్షణ పొందిన మోడల్‌లు బహుశా లక్షలాది మందిని కోల్పోతారు. భారతదేశం వివిధ డేటాసెట్‌లు, ప్రాంతీయ భాషా ఏఐ వ్యవస్థలు, ఫెయిర్‌నెస్ పరిశోధనలలో కూడా పెట్టుబడులు పెడుతోందని ప్రధాని మోదీ వివరించారు. సమ్మిట్ సమర్థిస్తున్న మరో కారణం బాధ్యతాయుతమైన ఏఐ పాలనలో అంతర్జాతీయ సహకారం అవసరమని అన్నారు.

ఆధార్, యూపీఐతో భారతదేశం సాధించిన విజయం బలమైన డిజిటల్ పునాదిని సృష్టించిందని ప్రధాని మోదీ తెలిపారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంటే ఏఐ ని పొరలుగా చేయడం వల్ల సంక్షేమ లక్ష్యం, మోసాలను గుర్తించడం, ప్రజా సేవల పంపిణీ మెరుగుపడుతుందని ప్రధానమంత్రి అన్నారు. భారతదేశ ఓపెన్ ఆర్కిటెక్చర్, స్థాయిలో బలమైన గోప్యతా రక్షణలపై నిర్మించినట్లు ఆయన చెప్పారు. లక్ష్యం ఏఐని దాని స్వంత ప్రయోజనాల కోసం స్వీకరించడం కాదు, రైతులు, ఎంఎస్ఎంఈలు , విద్యార్థులు, మహిళా వ్యవస్థాపకులకు అధికారం ఇచ్చే ఏఐ అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. భారత్ ఏఐ మిషన్ కింద, ప్రభుత్వం ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, విద్య వంటి రంగాలలో కంప్యూటర్ సామర్థ్యం, జీపీయూ యాక్సెస్, ఎక్సలెన్స్ కేంద్రాలను విస్తరిస్తోంది. కేంద్ర బడ్జెట్ 2026-27 డేటా సెంటర్లు, సెమీకండక్టర్ తయారీకి మద్దతును మరింత పెంచింది. భారతదేశ ఐటీ రంగం ఏఐ ద్వారా భర్తీ చేయమని, దాని ద్వారా రూపాంతరం చెందుతుందని ప్రధాని మోదీ అన్నారు. సేవా డెలివరీ నుండి ప్రపంచ మార్కెట్ల కోసం ఏఐ ఉత్పత్తులు, ప్లాట్‌ఫామ్‌లను నిర్మించడంపై దృష్టి సారించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. "మేము ప్రతిభను పెంపొందించడం మాత్రమే కాదు. ఏఐ విప్లవాన్ని రూపొందించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, విధాన పర్యావరణ వ్యవస్థ, నైపుణ్యాల స్థావరాన్ని నిర్మిస్తున్నాము" అని ఆయన అన్నారు.

కృత్రిమ మేధస్సు దుర్వినియోగంపై మానవ పర్యవేక్షణ అవసరమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. పారదర్శకత, నేర, ఉగ్రవాద అనువర్తనాలపై కఠినమైన నిషేధాలపై నిర్మించిన ప్రపంచ ఒప్పందం అవసరమని ప్రధాని పిలుపునిచ్చారు. ఏఐ -జనరేటెడ్ కంటెంట్‌ను వాటర్‌మార్క్ చేయడం, డేటా రక్షణ ఫ్రేమ్‌వర్క్‌లను బలోపేతం చేయడం వంటి దశలను ఆయన ప్రస్తావించారు. భారతదేశ విధానం ఆవిష్కరణను జవాబుదారీతనంతో సమతుల్యం చేస్తుందని ఆయన అన్నారు. ఉద్యోగ నష్టాల భయాలకు ప్రతిస్పందనగా, ఆవిష్కరణలు కొత్త అవకాశాలను సృష్టిస్తాయని చరిత్ర చూపిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. ఏఐ వైద్యులు, ఉపాధ్యాయులు, వ్యవస్థాపకులకు వృత్తిపరమైన పరిధిని విస్తరించే "శక్తిఅని ఆయన అభివర్ణించారు. స్టాన్‌ఫోర్డ్ గ్లోబల్ ఏఐ వైబ్రాన్సీ ఇండెక్స్ 2025లో, భారతదేశం మూడవ స్థానంలో నిలిచిందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఇది ఏఐ పరిశోధన, ప్రతిభలో బలమైన వృద్ధిని ప్రతిబింబిస్తుంది. సరైన నైపుణ్య కార్యక్రమాలతో భారతదేశ యువత భవిష్యత్తులో పనికి నాయకత్వం వహిస్తారని ప్రధానమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి మోదీ ముగింపు దృక్పథం ధైర్యంగా, స్పష్టంగా ఉంది. భారతదేశం కేవలం ఏఐని వినియోగించడమే కాదు, దానిని సృష్టించాలని, ఏఐలో ఆత్మనిర్భర్ భారత్ సాధించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. "ఏఐ వినియోగంలో మాత్రమే కాకుండా సృష్టిలో కూడా భారతదేశం ప్రపంచవ్యాప్తంగా అగ్రశ్రేణి మూడు ఏఐ సూపర్ పవర్‌లలో ఒకటిగా ఉండాలనేది నా లక్ష్యం" అని ఆయన అన్నారు. సార్వభౌమాధికారం, సమగ్రత, ఆవిష్కరణ.. భారతదేశ ఏఐ నమూనాలు, వారి మాతృభాషలలో బిలియన్ల మందికి సేవ చేస్తాయని ఆయన అన్నారు. భారతీయ ఏఐ స్టార్టప్‌లు లక్షలాది అధిక-నాణ్యత ఉద్యోగాలను సృష్టిస్తాయి. పబ్లిక్ ఏఐ వ్యవస్థలు ప్రపంచ ప్రమాణాలుగా మారతాయన్నారు. "ఏఐ లో ఆత్మనిర్భర్ భారత్ అంటే భారతదేశం డిజిటల్ శతాబ్దానికి తన సొంత కోడ్‌ను రాసుకోవడం" అని ప్రధాని మోదీ అన్నారు.

# అసెంబ్లీకి హాజరుకావడం ఎమ్మెల్యేల విధి

## అలా రానివారిని రీకాల్ చేయాల్సిందే

## స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**జయజయహే**



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు.. అసెంబ్లీ లాబీలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు చిట్‌చాట్ చేశారు. అయితే, విధులు సక్రమంగా నిర్వర్తించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలంటూ పిలుపునిచ్చారు.. అసెంబ్లీకి హాజరుకావడం ఎమ్మెల్యేల విధి అని స్పష్టం చేశారు స్పీకర్ అయ్యన్నపాత్రుడు.. కొందరు సభ్యులు సభకు హాజరుకాకుండానే జీతాభత్యాలు తీసుకుంటున్నారని.. సభకు హాజరుకాని సభ్యులకు జీతం కట్ చేయాలి కదా? అని ప్రశ్నించారు.. ఈ అంశాలన్నీ జాతీయ స్థాయిలో చర్చ చేపట్టామని? ఈ నిబంధన దాదాపు 8 దేశాల్లో అమల్లో ఉందన్నారు. ఇక, అసెంబ్లీలో నూతనంగా ప్రవేశపెట్టిన డిజిటల్ అటెండెన్స్ బాగా పని చేస్తోందన్నారు స్పీకర్ అయ్యన్నపాత్రుడు.. కాగా, తమకు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌తో అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడం లేదు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.. మొక్కుబడిగా.. అసెంబ్లీ ప్రారంభమైన తొలిరోజు హాజరై.. ఆ తర్వాత సమావేశాలకు దూరంగా ఉంటున్నారు.. మండలికి హాజరైన శాసన సభకు మాత్రం హాజరుకాకపోడంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు పలు సందర్భాల్లో ఎమ్మెల్యేల హాజరు విషయంపై చంలన వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే..

# గోదావరి గర్వం.. శతాబ్దపు చరిత్రతో ఆర్టోస్

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**




గోదావరి జిల్లాల సొగసులు చెప్పాలంటే పూతరేకులు, చీరమీను, కాకినాడ కాజా ముందుంటాయి. కానీ ఆ జాబితాలో మౌనంగా నిలిచే మరో ప్రత్యేకత ఉందిఆర్టోస్ కూల్‌డ్రింక్. ఇది కేవలం శీతల పానీయం కాదు; గోదారోళ్ల భావోద్వేగం, స్వదేశీ వ్యాపార స్ఫూర్తికి ప్రతీక.

**యాదృచ్ఛికంగా మొదలైన ప్రయాణం**

1914లో బ్రిటిష్ పాలనలో ఉన్న రోజులు. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురానికి చెందిన అడ్డూరి రామచంద్రరాజు ఒక యంత్రాన్ని కొనుగోలు చేయడం ఈ కథకు శ్రీకారం. అది సోడా తయారీ యంత్రం అని తెలుసుకున్న ఆయన విదేశాల నుంచి సీసాలు తెప్పించి సోడా తయారీ ప్రారంభించారు. మొదట్లో ప్రజలు ఆశ్చర్యపోయినా, యుద్ధానికి వెళ్తున్న సైనికులు అదే సోడాను తాగడం చూసి స్థానికులు కూడా అలవాటు పడ్డారు.

**స్వదేశీ సంకల్పం**

1919లో ఆయన తమ్ముడు జగన్నాథరాజు మద్రాసులో స్పెన్సర్స్ కూల్‌డ్రింక్ చూసి, అలాంటి పానీయం స్వదేశంలో తయారు చేయాలని నిశ్చయించుకున్నారు. ఇంగ్లాండ్ సంస్థతో సంప్రదించి ముడిసరకును తెప్పించి రామచంద్రపురంలోనే కూల్‌డ్రింక్ తయారీ ప్రారంభించారు. దేశంలో అప్పటికి ఉన్న కొద్ది సంస్థల్లో ఆర్టోస్ ఒకటిగా నిలిచింది.

**యుద్ధకాల పోరాటం**

రెండో ప్రపంచ యుద్ధం సమయంలో విదేశీ ముడిసరుకు అందుబాటులో లేకపోవడంతో అనేక కంపెనీలు మూతపడ్డాయి. కానీ ఆర్టోస్ స్థానికంగా లభించే నారింజలు, నిమ్మరసం ఉపయోగించి గ్యాస్ లేకుండా పానీయాలు తయారు చేసి మార్కెట్‌ను నిలబెట్టుకుంది. ఆ పట్టుదలే సంస్థను నిలబెట్టింది.

**పోటీ మధ్య నిలకడ**

స్వాతంత్ర్యానంతరం అంతర్జాతీయ కంపెనీల ప్రవేశం ఆర్టోస్‌కు సవాలుగా మారింది. అయినా గోదావరి ప్రజల మద్దతు తగ్గలేదు. ప్రత్యేకమైన రుచి, స్థానిక అనుబంధం బ్రాండ్‌కు బలమయ్యాయి. ప్రస్తుతం అడ్డూరి జగన్నాథవర్మ నాయకత్వంలో సంస్థ కొనసాగుతోంది. విజయవాడ, తాడేపల్లిగూడెం, భీమవరం వంటి పట్టణాలకు విస్తరించి, ఏడాదికి సుమారు రూ.25 కోట్ల టర్నోవర్‌ను సాధిస్తోంది.

శతాబ్దం దాటబోతున్న ఆర్టోస్ కథుసాధారణ వ్యాపార గాథ కాదు. ఇది ఒక ప్రాంతం తన స్వంత బ్రాండ్‌ను ఎలా కాపాడుకుంటుందో చెప్పే జీవంత ఉదాహరణ. గ్లాస్‌లో పోసిన ప్రతి చుక్కలో గోదావరి మట్టివాసనే.



# "రాజ్యంలో రాజ్యాంగం కాదు రెడ్‌బుక్ దందా!"

## అంబటి అరెస్ట్‌పై మండిపడ్డ గుడివాడ అమర్నాథ్

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని బలవంతంగా గొంతునులిమేస్తున్నారని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం రాజమండ్రి సెంట్రల్ జైలులో నిర్బంధంలో ఉన్న మాజీ మంత్రి అంబటి రాంబాబును చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీతో కలిసి ములాఖాత్ ద్వారా కలుసుకున్నారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు.

అంబటి రాంబాబుపై జరిగిన దాడి ఘటనలో అసలు దుండగులు బహిరంగంగా తిరుగుతుంటే, బాధితుడినే జైలుకు పంపించడం న్యాయవ్యవస్థను రాజకీయాలకు బలి చేసినట్టేనని ఆరోపించారు. రాష్ట్రంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగం అమలవడం లేదని, "రెడ్‌బుక్ రాజ్యాంగం" పేరిట కక్షసాధింపుల పాలన నడుస్తోందని విమర్శించారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపినందుకే అంబటిని లక్ష్యంగా చేసుకున్నారని, ఇది రాజకీయ ప్రతీకారానికి పరాకాష్ట అని అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలు, మౌనం పాటిస్తేనే రక్షణ అనే పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అప్పుల బారిన పడేసి ప్రజల భవిష్యత్తుతో ఆటలాడుతున్నారని ఆరోపించారు. లక్షల కోట్ల అప్పులు తీసుకున్నా అభివృద్ధి ఎక్కడ కనిపిస్తోందని ప్రశ్నించారు. రైతులు నష్టాల్లో కూరుకుపోతుంటే, నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తుంటే, ప్రభుత్వం మాత్రం ప్రచార హడావుడికే పరిమితమైందని మండిపడ్డారు.

"ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత ప్రజలదే. అణచివేతకు ప్రతిచర్య తప్పదు" అంటూ హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే కక్షపూరిత రాజకీయాలను ఆపి, చట్టపరమైన పరిపాలనకు తిరిగి రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రాజమండ్రి పార్లమెంట్ వైసీపీ అధ్యక్షుడు గూడూరి శ్రీనివాస్, విజయనగరం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, రాష్ట్ర హౌసింగ్ బోర్డు మాజీ చైర్మ పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రాత్రి గస్తీ కట్టుదిట్టం

## హైవేపై 'ఫేస్ వాష్ అండ్ గో' కార్యక్రమంతో అప్రమత్తం చేస్తున్న పోలీసులు

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

ప్రజలకు భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా తూర్పు గోదావరి జిల్లా పోలీసులు రాత్రి గస్తీని మరింత కట్టుదిట్టం చేశారు. జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నేరాల నియంత్రణపై దృష్టి సారించారు. రాత్రివేళల్లో అనుమానాస్పద కదలికలపై నిఘా పెంచడంతో పాటు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు.జాతీయ రహదారులపై పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వినూత్నంగా "ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. రాత్రి పూట దీర్ఘ ప్రయాణం చేస్తున్న వాహనదారులను ఆపి, అలసటతో డ్రైవింగ్ చేయకుండా ముఖం కడుక్కునే సౌకర్యం కల్పించి, కొంత విశ్రాంతి తీసుకున్న తర్వాతే ప్రయాణం కొనసాగించేలా సూచనలు ఇస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను కూడా కఠినంగా నిర్వహిస్తూ మద్యం సేవించి వాహనం నడిపేవారిపై కేసులు నమోదు చేస్తున్నారు.ఈ చర్యలతో నేరాలు, ప్రమాదాలు గణనీయంగా తగ్గే అవకాశముందని అధికారులు తెలిపారు. ప్రజలు కూడా పోలీసుల చర్యలకు సహకరించాలని, రాత్రివేళల్లో అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు.



# మహిళ డిగ్రీ కళాశాలలో నులిపురుగు నివారణ కార్యక్రమం

**అరకులోయ: జయ జయహే.**



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమము డిపార్ట్మెంట్ ఆఫ్ జువాలజీ హెల్త్ ఎడ్యుకేటర్ వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు మాట్లాడుతూ. భారతదేశంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం జరుపుకుంటారని , నులిపురుగుల మాత్రలను రెండు విడతలగా వేసుకోవచ్చని, ఒకటి నుండి 19 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలకు పేగు నులిపురుగుల ఇన్ఫెక్షన్లకు చికిత్స చేస్తారని ముఖ్యంగా ఆడపిల్లలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు .

ఈ కార్యక్రమంలో కళాశాల జంతుశాస్త్రం అధ్యాపకులు డాక్టర్ పి.బలరాం మాట్లాడుతూ. నులిపురుగులు మన శరీరంలో ఉన్న రోగనిరోధక శక్తి పై దాడి చేయడం కావలసిన పోషకాలను తీసుకోవడం వలన రక్తహీనత సంభవిస్తుందని అందువలన నులిపురుగుల నివారణ మాత్రలు( ఆల్బెండజోల్ ) వాడడం వలన ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని అందరూ నిర్మూలన మాత్రల పట్ల అపోహాలను వీడనాడాలని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జువాలజీ అధ్యాపకురాలు డీ కే వీ యస్ ప్రణీత మాట్లాడుతూ. ముఖ్యంగా చిన్నపిల్లలలో శరీర పెరుగుదల లోపిస్తుందని ,వాంతులు ,రక్తహీనత వస్తుందని ఈ సందర్భంగా తెలియజేస్తూ వ్యక్తిగత పరిశుభ్రతను నిత్యం పాటిస్తూ ఉండాలని ఆమె తెలియజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో కళాశాల హెల్త్ ఎడ్యుకేటర్ రక్షిత రాణి మాట్లాడుతూ. దినోత్సవం యొక్క ప్రత్యేకతను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించి ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె తెలియజేయడం జరిగింది. ఆమె ప్రత్యేక శ్రద్ధను వహించి, ప్రతి యొక్క విద్యార్థితో ఆల్బెండజోల్ మాత్రలను వేయించడం జరిగింది .

విద్యార్థులకు నులి పురుగుల నిర్మూలన కార్యక్రమము సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పట్టాసి చలపతి రావు విచ్చేసిన వైద్యసిబ్బంది, కళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ జువాలజీ అధ్యాపకులు, హెల్త్ ఎడ్యుకేటర్ వారి చేతులతో స్వయంగా ఆల్బెండజోల్ మాత్రలను వేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# పార్క్ పునరుద్ధరణకు అడపా వరప్రసాద్ కృషి

## ఎనిమిదేళ్ల నిర్లక్ష్యానికి ముగింపు

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని ఆవ రోడ్డులో 16వ వార్డు వాంబే అపార్ట్మెంట్స్ సమీపంలో ఉన్న 100 అడుగుల రోడ్డుకు ఆనుకుని ఉన్న పార్క్ పునరుద్ధరణకు బీజేపీ నాయకుడు అడపా వరప్రసాద్ చొరవ తీసుకోవడంతో ఎనిమిదేళ్ల నిర్లక్ష్యానికి తెరపడింది.

గత ఎనిమిదేళ్లుగా ఈ పార్క్ పూర్తిగా నిర్లక్ష్యానికి గురై డంపింగ్ యార్డుగా మారింది. జనసంచారం లేకపోవడంతో గంజాయి బ్యాచ్‌లు, మందుబాబులు అడ్డాగా ఉపయోగించుకుంటూ వచ్చారు. దీంతో చుట్టుపక్కల నివాసం ఉంటున్న ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు పార్క్ వైపు వెళ్లేందుకు సైతం వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

స్థానికుల సమస్యలను తెలుసుకున్న అడపా వరప్రసాద్ స్వయంగా పార్క్‌ను పరిశీలించి పరిస్థితిని నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. పార్క్‌లో పేరుకుపోయిన చెత్త, అసాంఘిక కార్యకలాపాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దీనిపై స్పందించిన కమిషనర్ వెంటనే జెసిబి యంత్రాన్ని పంపించి పార్క్ శుభ్రపరిచే పనులు ప్రారంభించమని ఆదేశాలు జారీ చేశారు. అధికారులు చర్యలు ప్రారంభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ సందర్భంగా అడపా వరప్రసాద్ మాట్లాడుతూ, "ప్రజల భద్రత, పిల్లల భవిష్యత్తు దృష్ట్యా పార్క్‌ను పునరుద్ధరించడం అత్యవసరం. ఎనిమిదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రదేశాన్ని మళ్లీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం మా బాధ్యత" అని అన్నారు.

అలాగే పార్క్ చుట్టూ వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, భద్రత కోసం గేటు నిర్మించాలని, పచ్చదనం పెంపొందించే చర్యలు చేపట్టాలని అధికారులను కోరినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పటికప్పుడు ముందుండి పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.



# నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి సంధ్యారాణి. దొన్ను దొర సమీక్ష

**అరకులోయ: జయ జయహే.**

నియోజకవర్గాల అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ గిరిజన శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సమీక్ష సమావేశం నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, మన్యం పార్వతీపురం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అరకు పార్లమెంట్ పరిధిలో గల శాసనసభ్యులు,తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంత నిధులు అవసరమవుతున్నాయి? ఏయే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్న అంశాలపై ఆరా తీశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ఎంతవరకు చేరుతున్నాయనే అంశాలపై సమీక్షించారు. అరకు నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి నివేదిక ఈ సందర్భంగా సియ్యారి దొన్ను దొర ఈ సమీక్ష సమావేశంలో వెల్లడించారు. ఏ యే గ్రామాలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నాయి? ఎక్కడెక్కడ రోడ్ల అవసరం ఉంది. వైద్య సదుపాయాలు, హాస్టల్లో విద్యార్థుల పరిస్థితి, ఆశ్రమ పాఠశాలలో ప్రస్తుతం పిల్లలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలు, తన నియోజకవర్గంలో పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సినటువంటి ప్రాంతాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు.




# విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రాల పంపిణీ

**అరకులోయ: జయ జయహే.**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అరకు వేలి లో ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ కె భరత్ కుమార్ నాయక్ సూచనల మేరకు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి కొండబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక సీఐ ఎల్ హిమగిరి ఎస్సై జి గోపాల్ రావు చేతుల మీదుగా సుమారు 400 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓ లు పి నాగబాబు, వై విజయలక్ష్మి,ఎం అనిత కుమారి అధ్యాపకులు ఎల్ ఎం ఎస్ గణేష్,బి లచ్చన్న విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



## నేల తల్లి ఆక్రందన: విషపు కోరల్లో 'రైతు నేస్తాలు'

జీవం లేని మట్టి,విషతుల్యం అవుతున్న నేల, కనుమరుగుతున్న వానపాములు, జీవరాశి మనుగడకే ముప్పుగా మారుతున్నాయా?

మట్టి పలకరిస్తేనే మనిషికి మనుగడ.. నేల పులకరిస్తేనే లోకానికి తిండి.. కానీ నేడు ఆ మట్టి మౌనంగా రోదిస్తోంది. అధిక దిగుబడుల వేటలో మనం చల్లుతున్న రసాయనాలు నేలతల్లి గర్భాన్ని ఛిద్రం చేస్తున్నాయి.

**కనుమరుగవుతున్న 'బయో-ఇంజనీర్లు '**

ప్రకృతి ప్రసాదించిన అద్భుత సృష్టి వానపాము. కేవలం ఒక అంగుళం పైపొర మట్టి సిద్ధమవ్వడానికి 500 నుంచి 1000 ఏళ్ల సమయం పడుతుంది. కానీ, మనం కొన్ని దశాబ్దాల్లోనే ఆ అమూల్యమైన సంపదను నాశనం చేస్తున్నాం.

నేలకు ఊపిరి : వానపాములు నేలను గుల్లబరచడం వల్ల గాలి ప్రసరణ పెరిగి, వేర్లు బలంగా విస్తరిస్తాయి.

నీటి సంరక్షణ: ఇవి చేసే రంధ్రాలు వర్షపు నీటిని భూగర్భంలోకి పంపి, నీటి మట్టాలను పెంచుతాయి.

సహజ ఎరువు: సేంద్రియ వ్యర్థాలను వానపాములు 'వర్మీకంపోస్టు'గా మార్చి నేలకు అసలైన జీవాన్నిస్తాయి.

**రసాయన విలయం: పెట్టుబడి భారం.. దిగుబడి మాయ!**

హరిత విప్లవం మనకు ఆహార భద్రతను ఇచ్చింది కానీ, క్రమంగా అది నియంత్రణ లేని రసాయన సంస్కృతికి బానిసను చేసింది.

క్షీణిస్తున్న కర్బనం : నేలలో ఉండాల్సిన సేంద్రియ కర్బనం ప్రమాదకర స్థాయికి పడిపోయింది.

రాయిలా మారుతున్న మట్టి: నేల చౌడు బారి గట్టిపడిపోతోంది. గతంలో వచ్చిన దిగుబడి రావాలంటే ఇప్పుడు రెట్టింపు ఎరువులు వేయాల్సి వస్తోంది. ఫలితంగా రైతు అప్పుల చక్రవ్యూహంలో చిక్కుకుంటున్నాడు.

**రోగాల పుట్టగా మారుతున్న ఆహారం**

ఇది కేవలం రైతు సమస్య మాత్రమే కాదు.. యావత్ సమాజపు ఆరోగ్య సంక్షోభం. రసాయన అవశేషాలతో పండుతున్న పంటలు క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు, హార్మోన్ లోపాలకు కేంద్ర బిందువులవుతున్నాయి. నేలలో విషం నింపి, మనం అమృతాన్ని ఎలా ఆశించగలం?

**పరిష్కార మార్గాలు - మన బాధ్యత**

సహజత్వమే అసలైన బలం: రసాయనాలపై ఆధారపడటం తగ్గించి, ప్రకృతి/సేంద్రియ సాగు వైపు అడుగులు వేయాలి. జీవామృతం వంటి సహజ సిద్ధమైన పోషకాలు భూమిలోని సూక్ష్మజీవులను మేల్కొల్పుతాయి.

పాడి – పంటల అనుబంధం : పాడి పశువుల పేడ, మూత్రమే భూమికి అసలైన ఔషధాలు. పశుపోషణ లేని వ్యవసాయం, జీవం లేని శరీరం వంటిదని గుర్తించాలి.

పంట వైవిధ్యం : ఏకపంట విధానం స్వస్తి పలికి, పంట మార్పిడి మరియు అంతర పంటల సాగును ప్రోత్సహించాలి.

ప్రభుత్వ మద్దతు : ప్రకృతి సాగు చేసే రైతుల కోసం ప్రత్యేక మార్కెటింగ్ సౌకర్యాలు, గిట్టుబాటు ధర కంటే మెరుగైన ప్రోత్సాహకాలు అందించడం ప్రభుత్వాల బాధ్యత.

మట్టిలో జీవం ఉంటేనే మనిషికి జీవితం ఉంటుంది. మట్టిలో మళ్లీ వానపాము కదలాలి.. నేలతల్లి గుండె చప్పుడు మళ్లీ వినిపించాలి. భూమిని ప్రేమిద్దాం.. ప్రకృతిని కాపాడుకుందాం.



జి. అజయ్ కుమార్
వ్యవసాయ నిపుణులు

## ప్రధాన రహదారులపై ఇసుక తొలగించాలి: సిపిఐఎం వినతి

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**



ప్రధాన రహదారులకు ఇరువైపులా పేరుకుపోయిన ఇసుకను తక్షణం తొలగించి ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులకు రక్షణ కల్పించాలని సీపీఎం తూర్పుగోదావరి జిల్లా కమిటీ సభ్యులు ఎం. సుందర్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కొవ్వూరు రెవిన్యూ డివిజన్ ఆర్వో అచ్యుతకుమారికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సుందర్ బాబు మాట్లాడుతూ గోదావరి నుంచి ఇసుక తరలిస్తున్న అధిక లోడుతో కూడిన వాహనాల కారణంగా రోడ్లపై ఇసుక జారిపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారుల వెంబడి రెండు అడుగుల నుంచి నాలుగు అడుగుల వరకు ఇసుక, మట్టిపొర పేరుకుపోయి ప్రమాదాలకు దారితీస్తోందన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఇసుకపై జారి పడే ప్రమాదం ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. ఇసుక రవాణా చేసే వాహనాల్లో అధిక లోడును నియంత్రించాలని, బరకాలతో కప్పి సరఫరా చేయాలని, అతివేగాన్ని అదుపులో పెట్టాలని అధికారులను కోరారు. అలాగే ఇప్పటికే పేరుకుపోయిన ఇసుకను తక్షణం తొలగించి రహదారులను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ముందు సంబంధిత శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# వ్యర్థాలను ఆర్థిక వనరులుగా మార్చుకోవాలి

(సి.హెచ్.ప్రతాప్)

***ఆధునిక సమాజంలో వ్యర్థాలు పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి ప్రధాన ముప్పుగా మారాయి. పట్టణాలు, గ్రామాల్లో పెరిగిపోతున్న చెత్తాగిరులు మన భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నాయి. అయితే ఈ వ్యర్థాలను కేవలం 'చెత్తగా' మాత్రమే చూడకుండా, ఒక గొప్ప ఆర్థిక వనరుగా గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది. పునఃఉపయోగం, పునర్వినియాసం ద్వారా వ్యర్థాల నుంచి సంపదను సృష్టించి పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు. భారతదేశంలో ప్రతిరోజూ లక్షలాది టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి, వీటిని శాస్త్రీయంగా నిర్వహిస్తే దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుంది.***



వ్యర్థాలు మన తప్పిదాలు మాత్రమే కాదు, అవి సరికొత్త అవకాశాలు. ఆహార శిథిలాలు, ప్లాస్టిక్, లోహాలు, కాగితం మరియు ఇలక్ట్రానిక్ వ్యర్థాలు ఇందులో ప్రధానమైనవి. వీటిని సేకరించి పక్కాగా వర్గీకరిస్తే అద్భుతమైన ఎరువులు, ఇంధనాలు మరియు కొత్త ఉత్పత్తులుగా మార్చవచ్చు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద గ్రామాల్లో బయోగ్యాస్ ప్లాంట్లు, కంపోస్టింగ్ యూనిట్లు విజయవంతమవుతున్నాయి. పార్వతీపురం వంటి ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు చెత్త నుంచి పూల కుండలు, అలంకరణ వస్తువులు తయారుచేసి ఆదాయం సంపాదిస్తున్నాయి. ఇలా వ్యర్థాలు సంక్షోభం నుంచి సంపదగా మారుతున్నాయి.

వ్యర్థాల నిర్వహణలో అత్యాధునిక సాంకేతికతలు నేడు విప్లవాత్మక మార్పులు తెస్తున్నాయి. 'ప్లాస్మా ఆర్క్ గ్యాసిఫికేషన్' వంటి సాంకేతికత ద్వారా వ్యర్థాలను అత్యధిక ఉష్ణోగ్రత వద్ద వేడి చేసి విద్యుత్ మరియు స్వచ్ఛమైన ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తున్నారు. అలాగే 'పైరోలిసిస్' పద్ధతిలో ప్లాస్టిక్ వ్యర్థాలను ముడి చమురుగా మారుస్తున్నారు. కృత్రిమ మేధస్సు ఆధారిత రోబోటిక్ వ్యవస్థలు చెత్తను వేగంగా వర్గీకరించడానికి తోడ్పడుతున్నాయి. ఇ-వ్యర్థాల నుంచి బంగారం, వెండి, రాగి వంటి విలువైన లోహాలను సేకరించే 'హైడ్రో మెటలర్జీ' ప్రక్రియ పారిశ్రామికంగా ఎంతో లాభసాటిగా మారింది. ఈ సాంకేతికతలు వ్యర్థాల నిర్మూలనను వేగవంతం చేస్తున్నాయి.

పునర్వినియాసం వల్ల కలిగే ప్రయోజనాలు అనంతం. ఆహార శిథిలాలతో తయారుచేసే జీవ ఎరువులు వ్యవసాయ ఉత్పాదకతను పెంచుతాయి. ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేసి రోడ్ల నిర్మాణంలో వాడటం వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గడమే కాకుండా రోడ్ల మన్నిక పెరుగుతుంది. ఇ-వ్యర్థాల నుంచి లోహాలను సేకరించడం వల్ల గనుల తవ్వకం అవసరం





తగ్గుతుంది. ఇది లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. స్వీడన్, జపాన్ వంటి దేశాలు ఈ మార్గంలో పయనిస్తూ 99 శాతం వ్యర్థాలను పునర్వాడకానికి పంపి లోకానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యర్థ నిర్వహణలో దేశంలోనే ముందంజలో ఉంది. స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 కింద రాష్ట్రవ్యాప్తంగా 13,000 కంటే ఎక్కువ గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేసింది. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు వంటి నగరాల్లో బయోమెథేన్ ప్లాంట్లు మరియు ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్లు సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. 'చెత్త నుండి విద్యుత్' ప్రాజెక్టుల ద్వారా విజయవాడలో 10 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. అంకుర సంస్థలకు ప్రోత్సాహకాలు అందిస్తూ, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తూ ప్రభుత్వం రీసైక్లింగ్‌ను ఒక ఉద్యమంలా నడుపుతోంది.

వ్యర్థాలు చెత్త కాదు, అవి సంపదకు బీజాలు. ప్రతి పౌరుడు ఈ మార్పులో భాగస్వామి కావాలి. మన ఇళ్లలోనే చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వర్గీకరించడం ప్రారంభించాలి. ఒక్కో వ్యక్తి తన చుట్టూ ఉన్న చెత్తను తగ్గించి పునఃఉపయోగం పాటిస్తే భారతదేశం త్వరలోనే పర్యావరణ స్నేహిత దేశంగా మారుతుంది. స్వచ్ఛ భారత్ కల సాకారం కావాలంటే వ్యర్థాలను వనరులుగా చూడటం అనివార్యం. మన చేతుల్లోనే భవిష్యత్తు ఉంది; చెత్తను సంపదగా మార్చి రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన భూమిని కానుకగా ఇవ్వాలి. పట్టుదలతో ముందుకు సాగుతూ వ్యర్థాలను ఆర్థిక వనరులుగా మార్చుదాం.

## విశాఖ రైల్వే జోన్: ఉత్తరాంధ్ర ప్రజల
# దశాబ్దాల కల సాకారం

(సి.హెచ్.ప్రతాప్)

***ఆంధ్రప్రదేశ్ ఉత్తర ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం, దీర్ఘకాల వాంఛ ఇప్పుడు వాస్తవ రూపం దాల్చుతోంది. విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం తుది ఆమోదం తెలపడం ఒక చారిత్రక ఘట్టం. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన హామీలలో ఇది అత్యంత కీలకమైనది. గత కొన్ని ఏళ్లుగా అనేక సాంకేతిక సవాళ్లు, పరిపాలనాపరమైన అడ్డంకులను ఎదుర్కొని, ఎట్టకేలకు ఈ స్వప్నం నెరవేరబోతోంది. ఈ జోన్ ఏర్పాటు ఉత్తరాంధ్ర ప్రాంత సామాజిక, ఆర్థికాభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది.***




నూతనంగా ఏర్పాటు కాబోతున్న ఈ దక్షిణ కోస్తా రైల్వే జోన్ విశాఖపట్నం ప్రధాన కార్యాలయంగా పనిచేస్తుంది. విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజన్లతో పాటు విశాఖ డివిజన్‌లోని కొంత భాగాన్ని కలిపి ఈ జోన్‌ను రూపొందించారు. సుమారు 3 వేల కిలోమీటర్ల పరిధిని కలిగి ఉండే ఈ జోన్, దక్షిణ మధ్య మరియు తూర్పు కోస్తా రైల్వేల నుంచి విడదీసిన డివిజన్లతో నిర్మితమవుతోంది. దీనివల్ల రాయలసీమ మరియు కోస్తా ఆంధ్ర ప్రాంతాల మధ్య రైలు అనుసంధానం మరింత మెరుగుపడుతుంది. ఇప్పటికే రైల్వే బోర్డు సమగ్ర ప్రాజెక్టు నివేదికకు ఆమోదం తెలిపింది. సిబ్బంది విభజన, ఆస్తుల బదిలీ ప్రక్రియలు వేగంగా జరుగుతున్నాయి.

ఈ రైల్వే జోన్ ఏర్పాటు వల్ల ఉత్తరాంధ్రకు చేకూరే ప్రయోజనాలు అపారమైనవి. విశాఖపట్నం పోర్టు మరియు పారిశ్రామిక కారిడార్ల నుంచి సరుకు రవాణా సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి కొత్త రైళ్లు ప్రారంభించడానికి, ఉన్న రైళ్ల వేగాన్ని పెంచడానికి ఈ జోన్ స్వయంప్రతిపత్తి దోహదపడుతుంది. వాలతేరు డివిజన్ పునర్వ్యవస్థీకరణ ద్వారా స్థానిక అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం కలుగుతుంది. విశాఖపట్నంలోని ముడసర్లోవ లేదా ఇతర కేటాయించిన భూముల్లో జోనల్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. దీనివల్ల వేల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయి.

విభజన తర్వాత ఈ జోన్ సాధన కోసం ఉత్తరాంధ్ర ప్రజలు, ప్రజా ప్రతినిధులు నిరంతరం పోరాటం చేశారు. భూముల కేటాయింపులో జాప్యం, రాజకీయ సమీకరణలు, రైల్వే బోర్డు అభ్యంతరాలు వంటి ఎన్నో ఆటంకాలు ఎదురయ్యాయి. అయినప్పటికీ, స్థానిక ఎంపీలు మరియు ప్రజాసంఘాలు చేసిన ఒత్తిడి వల్ల కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ విజయం ప్రజల సామూహిక కృషికి మరియు పట్టుదలకు నిదర్శనం. ఇప్పుడు జనరల్ మేనేజర్ నియామకం మరియు మౌలిక సదుపాయాల కల్పనతో పనులు వేగవంతం కానున్నాయి. ఇది కేవలం రైల్వే లైన్ల విస్తరణ మాత్రమే కాదు, ఒక ప్రాంత గౌరవానికి సంబంధించిన విజయం.

ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి పోయనుంది. ఈ జోన్ ద్వారా వచ్చే ఆదాయం, ఉపాధి అవకాశాలు విశాఖను గ్లోబల్ హబ్‌గా మార్చడానికి సహకరిస్తాయి. రాయలసీమ ప్రాంత ప్రజలకు సైతం రాజధాని అమరావతి మరియు విశాఖతో రవాణా సంబంధాలు మెరుగవుతాయి. ప్రభుత్వాలు మరియు ప్రజలు సమన్వయంతో వ్యవహరించి ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. ధైర్యం, ఓర్పుతో సాగించిన పోరాటం ఎప్పటికీ వృథా పోదని ఈ విజయం నిరూపించింది. ఉత్తరాంధ్ర ప్రగతి పథంలో ఈ రైల్వే జోన్ ఒక నూతన అధ్యాయాన్ని లిఖించబోతోంది

# విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం: గంటా





**భీమిలి, ఫిబ్రవరి 17: (జయ జయహే)**

ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యమిస్తూ బడ్జెట్ లో అత్యధిక కేటాయింపులు చేసిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమిలి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు మంగళవారం అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ ను తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లు అత్యుత్తమ సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించడానికి ప్రణాళికలు రూపకల్పన చేసుకోవాలన్నారు. చదువుకున్న పాఠశాలకు.. తల్లిదండ్రులకు.. పుట్టిన ఊరుకు.. మంచి పేరు తెచ్చేలా ఉన్నత స్థానాలకు చేరాలని పిలుపునిచ్చారు. చిన్న వయసులో నోబెల్ బహుమతి అందుకున్న మలాల్ చెప్పినట్టు విద్యార్థి - ఉపాధ్యాయుడు - పుస్తకం - కలానికి మాత్రమే ప్రపంచాన్ని మార్చగల శక్తి ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి, ఎదుగుదలకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

**విద్యార్థినులు గీసిన తన చిత్రాలను చూసి అచ్చెరువొందిన గంటా**

పాఠశాలకు వచ్చిన గంటా శ్రీనివాసరావు విద్యార్థినులు గీసిన తన చిత్రాలతో స్వాగతం పలకడంతో అచ్చెరువొందారు. తాము ఎంతో అభిమానంగా భావించే గంటా కు వినూత్నంగా స్వాగతం పలకాలనే ఆలోచనతో ఆయన బొమ్మలు గీశామని విద్యార్థినులు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జగదీష్, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ పద్మావతి, భీమిలి జడ్పీటీసీ గాడు వెంకటప్పడు, కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, గాడు చిన్ని కుమారి లక్ష్మి, పీవీ నరసింహం, కూటమి నేతలు చిక్కాల విజయ్ బాబు, తాత్రాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, కొప్పల రమేష్, గొలగాని నరేంద్ర, జీరు సత్యం, పాసి నరసింగరావు, పాండ్రంగి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు



## మగ ఆరోగ్య కార్యకర్తల పునర్ నియామకం హర్షణీయం

**టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారిని సత్కరిస్తున్న మగ ఆరోగ్య కార్యకర్తలు**

**విశాఖపట్నం, ఫిబ్రవరి 17, జయ జయ హే:**

వైద్య ఆరోగ్యశాఖలో మగ ఆరోగ్య కార్యకర్తలను రాష్ట్ర ప్రభుత్వ తిరిగి పునర్ నియామకం చేయడంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. శ్రీనివాసచారి చేసిన కృషి హర్షణీయమని ఆరోగ్య కార్యకర్తలు పేర్కొన్నారు. ఈసందర్భంగా మద్దిలపాలెం సబ్ యూనిట్ కార్యాలయంలో మంగళవారం పునర్ నియామకం అయిన ఆరోగ్య కార్యకర్తలు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పునర్ నియామాకానికి రాష్ట్ర ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం వలన ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా 730 మంది తిరిగి విధులోకి చేరారన్నారు. వీరందరికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన అని రాయితీల వచ్చేలా కృషి చేస్తానన్నారు. వీరికి 100శాతం జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోనున్నామన్నారు. నిబంధల మేరకు 100 పర్సంటేజ్ సాలరీకి వీరందరూ అర్హులన్నారు. విధులో నిబద్ధతతో పనిచేసి ప్రజలకు సేవలందించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయిక్, శేషుబాబులను శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో బండారు శ్రీనివాసరావు, సూపర్ వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



## రికార్డులను పరిశీలిస్తున్న పి ఓ మంగతాయారు

**బుచ్చయ్య పేట జయ జయహే**

అంగన్వాడి దశనుండే పిల్లల్ని ఆటపాటలతో పాటు విద్యాబుద్ధులు నేర్పితే వాళ్ళు ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఎంపీడీవో శివప్రసాద్ నారాయణ ఐసిడిఎస్ పిఓ మంగతాయారు తెలిపారు. బుచ్చయ్యపేట మండలం లోపూడి 2 అంగన్వాడి కేంద్రాన్ని వారు పరిశీలించారు. అంగన్వాడి కేంద్రంలో ఉన్న పిల్లలను వాళ్ళు చదివే విధానాన్ని చూసి అభినందించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. పిల్లల ప్రీ స్కూల్ విధానాన్ని మెరుగుపరచాలని తెలిపారు. పిల్లలకు అందించే పౌష్టికాహారం క్రమం తప్పకుండా నిర్వహించాలని తెలిపారు. మెనూ క్రమం తప్పకుండా పాటించాలని సూచించారు. సెంటర్ పరిధిలో ఉన్న స్టాకులను పరిశీలించారు గుడ్లు పాలు వచ్చేటప్పుడు ఎక్స్పరి డేట్ చూసి తీసుకోవాలని తెలిపారు. నిల్వ వస్తువులు నిలువ ప్యాకెట్లు ఉంచు రాదని తెలిపారు. సెంటర్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్వాడి పరిధిలో ఉన్న పిల్లలకు గర్భిణీ బాలింతలకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. అలాగే సెంటర్ పరిధిలో వికలాంగ పిల్లలు కానీ బరువు తక్కువ ఉన్న పిల్లల గాని ఉంటే వారికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అటువంటి పిల్లలు ఉన్నట్లయితే ముందుగా తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ నిర్మలాదేవి అంగన్వాడి కార్యకర్త కడియం జ్యోతి సునీత పాల్గొన్నారు.

## ఘనంగా షిరిడి సాయి బాబా ఆలయ 21వ వార్షికోత్సవం

**కొయ్యూరు : (జయ జయహే ) న్యూస్ ఫిబ్రవరి 18**

అల్లూరి జిల్లా మండల కేంద్రం సింగవరం లో వెలసిన శ్రీ శిరిడి సాయి బాబా ఆలయ 21వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది.ఆలయ అర్చకులు డి.శ్రీ రామ చంద్రమూర్తి శర్మ ఆధ్వర్యం లో ప్రత్యేక పూజలు,వేద పండితులు అశోక్ కుమార్ శర్మ హోమాలు నిర్వహించారు.ఆలయ కమిటీ వారు భారీ అన్నసంతర్పణ, అనంతరం పల్లకి సేవ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి భారీగా భక్తులు తరలి వచ్చారు..



# ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న లిక్కర్ సిండికేట్

**మద్యం దుకాణాల చుట్టూ అనధికారికంగా షాపులు..**

**పర్మిట్ రూమ్‌లకు అనుమతులు లేవు**

**చోద్యం చూస్తున్న సంబంధిత యంత్రాంగం..**

**జయ జయహే : ఓజిలి , ప్రత్యేక ప్రతినిధి:**



మద్యం దుకాణాల వద్ద కనీస నిబంధనలు పాటించడం లేదు. మద్యం దుకాణాల చుట్టూ అనధికారికంగా షాపులు వెలుస్తున్నాయి. అక్కడే మద్యం తాగుతుండడంతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఓజిలి మండలంలో 3 మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. అయితే చాలా వరకూ షాపుల వద్ద కనీస నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మద్యం దుకాణాల చుట్టూ ప్రాంతాల్లో ఎటువంటి కూల్ డ్రింక్ షాపులు , మద్యం దుకాణాల వద్ద మద్యం సేవించడం అలాంటివి చట్ట విరుద్ధంగా ఉన్నప్పటికీ మద్యం సిండికేట్ మాఫియా అదేమీ పట్టనట్లు బహిరంగంగానే మద్యం దుకాణాల వద్దనే ఇచ్చినవిడిగా మద్యాన్ని తాగిస్తున్నారు. ముఖ్యంగా మద్యం దుకాణాలను ఏర్పాటు చేసిన వారు చుట్టుపక్కల ఉన్న ఇతర షాపులను సైతం అద్దెకు తీసుకుంటున్నారు. అక్కడ తమ వారితోనే ఫాస్టుఫుడ్ సెంటర్లు, పాన్ షాపులు పెడుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఇంత తతంగం జరుగుతున్న సంబంధిత అధికారులు నిమ్మకు నీతినట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలకు తావుతీస్తుంది. మద్యం దుకాణాల వద్ద ప్రభుత్వం ఎటువంటి పర్మిట్ రూమ్‌లకు అనుమతివ్వలేదు. మద్యం దుకాణాల వద్ద తాగేందుకు అనుమతులు ఇవ్వాలంటే ప్రభుత్వానికి అదనంగా రూ.5 లక్షలు రూపాయలు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన నగదును దుకాణదారులు చెల్లించకుండానే వారు కేటాయించుకున్న షాపుల్లో మద్యాన్ని బహిరంగంగ తాగిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తుంటే అధికారులు పట్టి పట్టినట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.




## షోడశ గుణాభిరాముడు శ్రీరాముడు

**డాక్టర్ దోనేపూడి నరేశ్ బాబు**

**జూలేపల్లిలో ప్రారంభమైన ధార్మిక కార్యక్రమాలు**

**కర్నూలు (జయ జయహే)**

శ్రీరాముడు మర్యాద పురుషోత్తముడని, సకల గుణాభిరాముడైన శ్రీరాముడి నుండి ఈనాటి సమాజం నేర్చుకోవలసిన ఎన్నో విషయాలు ఉన్నాయని, రామాయణంలో శ్రీరాముడు 16 గుణాలతో శోభిల్లుతున్న లోకోత్తరమైన నాయకుడి చరిత్రను ఈనాటి సమాజం అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతో ఉన్నదని తెలుగు పండితులు డాక్టర్ దోనెపూడి నరేశ్ బాబు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గోస్పాడు మండలం, జూలేపల్లి గ్రామంలోని శ్రీ సాయిబాబా మందిరం నందు ధార్మిక కార్యక్రమాలలో భాగంగా మొదటి రోజు శ్రీమద్రామాయణంలోని లోకోత్తర నాయకుడైన శ్రీరామచంద్రుడి యొక్క చరిత్రను భక్తులకు వివరించారు. ధార్మిక వ్యాప్తి కోసం తిరుమల తిరుపతి దేవస్థానములు ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ ఉందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో నున్న సుబ్బరాయుడు, కె కృష్ణమూర్తి, రెడ్డి మధు, అడపా వెంకటసుబ్బయ్య, కె శివ, మంజుల రాముడుతోపాటు స్థానిక భక్త సమాజాల సభ్యులు పాల్గొన్నారు.



## దీర్ఘకాలిక వ్యాధులపై వీధి నాటిక

**మాకవరపాలెం( జయ జయహే)**

దీర్ఘకాలిక వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలనే సందేశాన్నిస్తూ.. మంగళవారం మాకవరపాలెం బస్టాండ్ వద్ద జరిగిన వీధినాటిక ఆహుతులకు ఆద్యంతం అలరించింది. హృదయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వీధి నాటక ప్రదర్శన చేశారు .దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, అధిక రక్తపోటు , ఆర్థరైటిస్ వంటి వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. వాటిని మందులతో నియంత్రించుకోవచ్చును గాని పూర్తిగా నిర్మూలన చేయలేమని, కాబట్టి క్రమం తప్పకుండా మందులు వాడుతూ క్రమ పద్ధతిలో వ్యాయామాలు చేస్తూ మంచి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చు అన్నారు. ఈ వ్యాధులు ఒకరి నుంచి ఒకరికి వ్యాపించే వ్యాధులు కాదని అయితే జీవితాంతం వీటితో నిర్వహణ కొనసాగించాలని ఈ వ్యాధులు ఉన్నవారు ఖైనీ , గుట్కా వంటి పొగాకు ఉత్పత్తుల జోలికి వెళ్లరాదని సూచించారు. ఈ వ్యాధులతో బాధపడుతున్నవారు తమ వ్యవహార జీవన శైలిని మార్చుకోకపోతే ప్రాణాల మీదకు తెచ్చుకునే పరిస్థితి వస్తుందన్నారు .బహుళ దీర్ఘకాలిక వ్యాధుల తో బాధపడుతున్న వారు క్రమ పద్ధతిలో మెడిసిన్స్ వాడేందుకు పిల్ ఆర్గనైజర్, రిమైండర్ , స్థానిక హెల్త్ కోఆర్డినేటర్ వంటివారి సహకారంతో ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు.జంక్ ఫుడ్స్ జోలికి పోకుండా తృణ ధాన్యాలు, డ్రైఫ్రూట్స్ , ఉడకపెట్టిన ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు.ఢిల్లీ నుండి ఈ కార్యక్రమానికి హాజరైనటువంటి హృదయ్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ..డాక్టర్ మాన్సీ చోప్రా మాట్లాడుతూ వ్యాధుల పట్ల పలు సూచనలు చేశారు. మాకవరపాలెం పిహెచ్ సి వైద్యులు శ్రీనివాస్, రీసెర్చ్ అసిస్టెంట్ .కే సతీష్, కోఆర్డినేటర్లు శివ తదితరులతో పాటు భద్రం ఫౌండేషన్ కళాకారులు డేవిడ్ రాజు, ఎండి .మొహిదీన్ , బోరాసముద్రం, ఎస్. భవాని రాజు , కే .కుమారి ,బోనీ రమేష్ , కెమెరామెన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## పంచాయతీలకు డస్ట్ బిన్లు, ట్రై సైకిల్స్ పంపిణి

**కొయ్యూరు :(జయ జయహే)న్యూస్ ఫిబ్రవరి 18**


అల్లూరి జిల్లా కొయ్యురు ఎంపిడిఓ కార్యాలయం లో మండలం లోని 33 పంచాయతీలకు మంజూరు అయినా డస్ట్ బిన్నులు, ట్రై సైకిళ్ళు ను పంచాయతీ అభివృద్ధి అధికారులకు కొయ్యురు ఎంపిపి బడుగు రమేష్, జిసిసి మాజీ చైర్మన్ ఎంవివిఎస్ ప్రసాద్, ఎంపిడిఓ జిడివి ప్రసాద్ చేతుల మీదుగా అందచేశారు. గ్రామాలలో పారిశుద్య పనులు, చెత్త సేకరన కార్యక్రమాలు పక్కాగా అమలు చేయాలన్నారు.పరిసరాల పరిశుభ్రం గా ఉన్నపుడే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుంది అని కొనియాడారు.ఈ కార్యక్రమం లో ఎంపీపీ బడుగు రమేష్, జిసీసీ మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్, ఎంపిడిఓ జీడివి ప్రసాద్ పాల్గొన్నారు.

For a pure tomorrow..
జయ జయహే

# గూగుల్ డేటా సెంటర్ భూసేకరణ సంపూర్ణం

## గంటా చొరవతో ముందుకొచ్చిన రైతులు

**విశాఖపట్నం, ఫిబ్రవరి 17:(జయ జయహే)**



ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో గూగుల్ డేటా సెంటర్ కోసం చేస్తున్న భూసేకరణ పూర్తయ్యింది. ఇప్పటివరకూ భూమి ఇవ్వని దివ్యాంగుడైన రైతు గణేష్ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవతో మంగళవారం అంగీకార పత్రాలను మండల రెవిన్యూ అధికారులకు సమర్పించారు. అంతకుముందు భీమిలి బాలికల గురుకుల పాఠశాల కార్యక్రమంలో పాల్గొన్న గంటాను కలిశారు. ప్రభుత్వం నుంచి అదనంగా పరిహారం తెచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. శాలువా కప్పి ఆయనపై అభిమానాన్ని చాటుకుని తన 1.94 ఎకరాల అసైన్డ్ భూమి గూగుల్ డేటా సెంటర్ కోసం ఇస్తున్నట్టు చెప్పారు. విశాఖకు గ్రోత్ ఇంజన్ గా కానున్న గూగుల్ కు భూమి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నందుకు గణేష్ ను గంటా అభినందించారు. గూగుల్ డేటా సెంటర్ కోసం మొత్తం 308 ఎకరాలను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే.

**వైసీపీ కుట్రలకు చెక్**

ప్రభుత్వం ఇచ్చే పరిహారం కంటే ఎక్కువ ఇస్తామని వైసీపీ నాయకుల బినామీ ఒకరు రైతులను మభ్య పెట్టడంతో ప్రారంభంలో కొందరు ఆలోచనలో పడ్డారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ లు సీఎం విశాఖ వచ్చినప్పుడు పరిస్థితి వివరించి.. ఎకరా రూ. 17 లక్షలుగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ మార్కెట్ రేట్ స్థానంలో పరిహారాన్ని రూ. 20 లక్షలకు పెంచేలా చేశారు. ఎకరంలో 80 సెంట్ల భూమికి రెండున్నర రెట్ల పరిహారాన్ని, అంటే రూ.40 లక్షలు కాకుండా 20 సెంట్ల భూమి కూడా ఇస్తామని ప్రకటించారు. అలాగే ఇంటికో ఉద్యోగం, ఉపాధి కోసం షాపింగ్ కాంప్లెక్స్ లో ఒక షాపు, బంజరు భూముల అభివృద్ధి పథకం కింద సాగు చేస్తున్న 520 మంది రైతులకు 3 సెంట్ల నివేశన స్థలాలు ఇస్తామని చెప్పడంతో అధికశాతం మంది రైతులు భూమిలివ్వడానికి సుముఖత వ్యక్తం చేశారు. గంభీరంలో ఐఐఎం కోసం భూసేకరణ చేసినప్పుడు విద్యా శాఖ మంత్రిగా ఉన్న గంటా అత్యుత్తమ ప్యాకేజీ ఇచ్చారని పేర్కొంటూ తర్లువాడ మాజీ సర్పంచ్ మజ్జి వెంకట్రావు (వైసీపీ) భూమిలివ్వడానికి ముందుకు వచ్చారు. మొత్తం 51 మంది అసైనీలు కూడా భూములు ఇవ్వడానికి అంగీకరిస్తూ అధికారికంగా పత్రాలు ఇవ్వడంతో గూగుల్ డేటా సెంటర్ భూసేకరణ పూర్తయ్యిందని ఎమ్మార్వో ఎస్.శ్రీనుబాబు చెప్పారు. వచ్చే నెలలో శంకుస్థాపన చేసే అవకాశం ఉన్నందున ఎలాంటి వివాదాలు లేకుండా భూసేకరణ పూర్తి కావడం శుభపరిణామంగా గంటా పేర్కొన్నారు.



# రాష్ట్రంలో అరాచక పాలన

## గుడివాడ కీలక వ్యాఖ్యలు

**చోడవరం ఫిబ్రవరి 17 జయ జయహే**

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని వైసిపి నేత మాజీ మంత్రి అంబటి రాంబాబును అక్రమంగా అరెస్ట్ చేశారని మాజీ మంత్రి , చోడవరం సమన్వయకర్త గుడివాడ అమర్నాథ్ మండిపడ్డారు.మంగళవారం రాజమండ్రి జైలులో ఉన్న అంబటి రాంబాబు నిమాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంమాజీ ఎమ్మెల్యే లు కరణం ధర్మశ్రీ జక్కంపూడి రాజా ,విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావుఅనకాపల్లి జిల్లా పార్లమెంట్ ఇంచార్జ్బొడ్డేడ ప్రసాద్ వై ఎస్ ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు,కిర్లంపూడి ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు, కాంగ్రెస్ నేతజగత శ్రీనివాస్ తో కలిసి ములాఖత్ అయ్యారు.దాదాపు 40 నిమిషాల పాటు రాంబాబు తో చర్చించారు. అనంతరం అమర్నాద్ మీడియాతో మాట్లాడారు. ఏపీలో అరాచక పాలన సాగుతోందని అసహనం వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.



# స్వయంభు గౌరీశ్వర స్వామి వారి స్టిక్కర్స్ ఆవిష్కరణ

**చోడవరం ఫిబ్రవరి 17 జయ జయహే**

చోడవరం స్వయంభు శ్రీ గౌరీశ్వరస్వామి వారి స్టిక్కర్స్ను స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు మంగళవారం ఆవిష్కరించారు.ఈ స్టిక్కర్స్ను దేవస్థానం కి వర్షు ఫౌండేషన్ కి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కాత బాలకృష్ణ స్వయంభు స్వామివారి స్టిక్కర్స్ స్పాన్సింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు కే మచ్చిరాజు, కూటమి నాయకులు దేవాదయ అర్చకులు ఆలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


# బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్ద పీఠ బడ్జెట్‌లో రూ.353 కోట్లు

## హర్షం వ్యక్తం చేసిన ఏ.పి. బ్రాహ్మణ అర్చక పురోహిత సంక్షేమ సేవా సంఘం

**చోడవరం : ఫిబ్రవరి 17, జయ జయహే**



2026-27 బడ్జెట్ లో బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ. 353 కోట్లు కేటాయించడం, సి.ఎం. చంద్రబాబుకు బ్రాహ్మణుల పై ఉన్న చిత్తశుద్ధి, నమ్మకమే అని హర్షం వ్యక్తం చేస్తూ, ఏపీ బ్రాహ్మణ అర్చక పురోహిత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అద్యక్షుడు, టిడిపి సీనియర్ నాయకులు దుర్వాసుల రామశాస్త్రి మంగళవారం ఓ ప్రకటన లో తెలియజేశారు. బ్రాహ్మణులు ఆర్థికంగా బలపడేందుకు 23 కోట్ల రూపాయలు సబ్సిడీ రుణాలు అందిస్తున్నారని తెలిపారు. బ్రాహ్మణులకు రాజకీయ అవకాశాలు కల్పించేందుకు, పార్టీ పదవుల్లో స్థానం కల్పించారని అన్నారు. నిరుపేద బ్రాహ్మణులను ఆదుకునేందుకు బడ్జెట్లో కేటాయించిన నిధులే కాకుండా బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాలు ప్రవేశపెట్టి ఆదుకుంటున్నారని తెలియజేశారు. కూటమి ప్రభుత్వంలో బ్రాహ్మణులకు సముచిత స్థానం, ఆర్థిక, సామాజిక గౌరవాన్ని కల్పిస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీ.ఎం చంద్రబాబు నాయుడుకు .... రాష్ట్ర బ్రాహ్మణ అర్చక పురోహిత సంక్షేమ సేవా సంఘం తరపున ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు.



# ఉత్తమ బాలాజిస్ట్ రోహిత్‌కి సత్కారం

**మాడుగుల ఫిబ్రవరి 17 జయ జయహే**

మాడుగుల మండలం కింతలి జిల్లా పరిషత్ హై స్కూల్ మంగళవారం ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఆర్ట్ వేసిన మాడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పుట్టా రోహితును అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.




# డిగ్రీ కళాశాల విద్యార్థులకు రోడ్డు సేఫ్టీ అవగాహన

**అరకులోయ: జయ జయహే.**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అరకు వేలి జాతీయసేవా పథకం ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ కె భరత్ కుమార్ నాయక్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి కొండబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రోడ్డు భద్రత అందరి బాధ్యత అన్నారు.ముఖ్యఅతిథిలుగా స్థానిక సీఐ ఎల్ హిమగిరి, ఎస్సై జి గోపాల్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఈ రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్,ఎమర్జెన్సీ అనే అంశాలపై ఆధారపడి ఉందని వాటి గురించి వివరించారు. విద్యార్థులుగా మీరు తెలుసుకున్న రోడ్డు సేఫ్టీ కి సంబంధించిన విషయాలను గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎన్ఎస్ఎస్ పిఓలు పి నాగబాబు, వై విజయలక్ష్మి, ఎం అనిత కుమారి మాట్లాడుతూ.నేడు ముఖ్యంగా యువత ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా ప్రయాణాలు చేస్తున్నారని దీని వలన ప్రాణాలు కోల్పోతున్నారని కాబట్టి సమాజంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి వారి ప్రాణాలను కాపాడుకుంటూ ఎదుట వారి ప్రాణాలను కూడా రక్షించాలి అని తెలియజేసారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎల్ఎంఎస్ గణేష్, బి లచ్చన్న ఎస్ ఎస్ ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.




# ఆందోళన చేపట్టిన బోర్వెల్ అసోసియేషన్

## బోర్ వెల్స్ సామాగ్రి ధరలు తగ్గించాలని డిమాండ్

**చోడవరం: ఫిబ్రవరి 17 జయ జయహే**

బోర్ వెల్స్ సామాగ్రి ధరలు విపరీతంగా పెరగడం వల్ల నిర్వహణ భారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఉమ్మడి విశాఖ జిల్లా బోర్వెల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం చోడవరం మండలం నరసయ్యపేటలో అసోసియేషన్ జిల్లా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరలు పెరుగుదల వల్ల సమ్మె చేపడుతున్నామని తెలిపారు. బిట్లు, హైమర్, ఇతర సామాన్ల ధరలు బాగా పెరిగాయన్నారు. వర్కర్స్ జీతాలు పెరగడం వల్ల బోర్ వెల్స్ వాహనాల నిర్వహణ కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బిట్ల ధరలు తగ్గించి వినియోగదారులకు అందుబాటులో తేవాలని కోరారు.ఏపీ విభజన కారణంగా బోర్ వెల్స్ తయారీ రంగం తెలంగాణలోకి వెళ్లిపోయిందని చెప్పారు. ఏపీలో కూడా తయారీ రంగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు బోర్ వెల్స్ సంబంధించి ఒక కంపెనీని ఏర్పాటు చేస్తే ఎంతోమంది జీవనోపాధి పొందుతారని తెలిపారు. అధ్యక్షులు ప్రభుజీ, నాని, డి సంతోష్, గండ శీను, ప్రసాదు, సురేషు, దిలీపు, రాజేంద్ర, వైజాగ్ అసోసియేషన్ సభ్యులు నవీన్ రెడ్డి, బాలరాజు, వెంకటేశ్వర, ఎస్ వి ఎస్ చిన్న , కాంటాక్ట్ రాజు, సతీష్ ,సురేషు ,చిట్టిబాబు, సంజీవ్ ,మంగ నాయుడు, లావరాజు, రాకేష్, సుమారు సతీస్ వినీత్ 200 మంది బోర్వెల్స్ సమ్మెలో పాల్గొన్నారు.



# ప్రతి శనివారం అక్షరాంధ్ర కార్యక్రమం నిర్వహించాలి

**మాడుగుల ఫిబ్రవరి 17 జయ జయహే**

ప్రతి శనివారం ప్రతి పంచాయతీలో అక్షరాంధ్ర కార్యక్రమం నిర్వహించి దానిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎండిఓ కే అప్పారావు సూచించారు. మంగళవారం మాడుగుల్లో జరిగిన వివో ఎలా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా ఐవిఆర్ఎస్ కాల్స్, మొబిలైజేషన్, వాట్సప్ గవర్నెన్స్ వంటి వాటి గురించి మాట్లాడుతూ ప్రతీ శనివారం ఎస్ ఏ ఎస్ ఏ కార్యక్రమములో భాగశీగా ప్రతీ పంచాయితీలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

# క్రీడా పోటీల్లో ఉషోదయ విద్యార్థుల ప్రతిభ

**చోడవరం ఫిబ్రవరి 17 జయ జయహే**



నర్సీపట్నం లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయిలో మై భారత్ వారు నిర్వహించిన క్రీడ పోటీల్లో ఉషోదయ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. దీనిలో భాగంగా బాలిక విభాగంలో కబడ్డీ ద్వితీయ స్థానాన్ని, బాలురు విభాగంలో వాలీబాల్ ప్రథమ స్థానాన్ని, వ్యక్తిగత అంశాల్లో షార్ట్ ఫుట్ సాయికి ప్రథమ, సురేంద్రకు ద్వితీయ స్థానాన్ని,రన్నింగ్ 200 మీటర్లు పందెంలో కృష్ణకు ప్రథమ స్థానం, శరత్ ద్వితీయ స్థానాన్ని కైవాసం చేసుకున్నారు. ఈ విజయం పట్ల ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జే. రమణాజీ, కరస్పాండెంట్ కృష్ణకుమారి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్యాంజి, డీన్ ఎస్ వి వాసు, ప్రిన్సిపల్ ఎస్ ఎన్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ పి దొరబాబు విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఉషోదయ డిగ్రీ కళాశాల చదువుతోపాటు క్రీడాంశాలను, ఎన్సిసి ఎన్ఎస్ఎస్ వంటి సహపాఠ్య కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల సర్వతో ముఖభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. ఈ విజయం పట్ల తోటి అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో అకడమిక్ ఇంచార్జి కె.హర్షవర్ధన్,పీడీ సిహెచ్ గణేష్, విద్యార్థులకు సహాయ సహకారాలు అందించారు.

# విశాఖలో రాష్ట్రపతి ముర్ముకు ఘన స్వాగతం








**విశాఖపట్నం, ఫిబ్రవరి 17, జయ జయ హే:**

విశాఖపట్నం ఐ ఎన్ ఎస్ డేగా వద్ద భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కి ఘనస్వాగతం లభించింది. ఐఎఫ్ఆర్ కార్యక్రమంలో పాల్గొనడానికి విశాఖపట్నం విచ్చేసిన భారత రాష్ట్రపతి ముర్ముకి పుష్పగుచ్ఛం అందజేసి నగర మేయర్ పీలా శ్రీనివాసరావు స్వాగతం పలికారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఇంచార్జి మంత్రి డోల వీరాంజ నేయ స్వామి, జిల్లా కలెక్టర్ హరేందిరా ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, నేవల్, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, సీనియర్ ఐ ఏ ఎస్, ఐ పి ఎస్ అధికారులు పాల్గొన్నారు,

# తిరుమల లడ్డూ కల్తీపై వైసీపీ దొంగ ఏడుపు

## లడ్డూ కల్తీ నిజం...అప్పటి టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డే కల్తీ జరిగిందని అంగీకారం

## హిందూ సంప్రదాయాలపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు

## నిజం దాగదు, బాధ్యులపై చర్యలు తప్పవని మండలిలో హెచ్చరించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి (జయ జయహే)**

శాసనమండలిలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వైసీపీ ఎమ్మెల్సీలపై, ఆ పార్టీ నేతలపై ఆగ్రహంతో విరుచుకుపడ్డారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని అప్పటి టీటీడీ చైర్మన్ స్వయంగా ఒప్పుకున్న వాస్తవాన్ని దాచిపెట్టి, సిగ్గుపడాల్సింది పోయి వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వంపై ఎదురు దాడులు చేయడం, సంబంధం లేని హెరిటేజ్ సంస్థపై ఆరోపణలు చేయడం దారుణమని ఆయన మండిపడ్డారు. కల్తీ జరిగిందని ఒప్పుకున్న తర్వాత కూడా బాధ్యత నుంచి తప్పించుకోవడానికి కుట్ర రాజకీయాలు చేయడం వైసీపీ తీరుకు నిదర్శనమన్నారు. మాజీ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్వయంగా లడ్డూ కల్తీ విషయాన్ని ఒప్పుకున్నారు అనే నిజాన్ని ప్రజలు మరచిపోరన్నారు. అయినా ఈ రోజు అదే వైసీపీ నేతలు దాన్ని మళ్లించేందుకు కొత్త ఆరోపణలు తీసుకురావడం, నిజాలను వక్రీకరించడం అత్యంత ఖండనీయం అని పేర్కొన్నారు. ఆధారాలు లేని



ఆరోపణలతో ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయాలనుకోవడం రాజకీయ దిగజారుడుతనం అని విమర్శించారు. హెరిటేజ్ ఇష్యూపై వైసీపీ చేస్తున్న ఆరోపణలకు ఒక్క ఆధారం అయినా చూపించగలరా? అని మంత్రి సూటిగా ప్రశ్నించారు. కల్తీతో ఎలాంటి సంబంధం లేని హెరిటేజ్ సంస్థ పేరును లాగడం ద్వారా అసలు అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించాలనే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఆధారాల్లేని ఆరోపణలు చేస్తే చట్టపరంగా, నైతికంగా సమాధానం చెప్పాల్సిందే అని హెచ్చరించారు. అదే విధంగా, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తిరుమల శ్రీవారి ఆలయానికి వెళ్లి డిక్లరేషన్ ఎందుకు ఇవ్వడం లేదు? అని మంత్రి ప్రశ్నించారు. హిందూ సంప్రదాయాలపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని, ఎందుకంటే హిందువుల మనోభావాలను దెబ్బతీసింది ఎవరో రాష్ట్ర ప్రజలందరికీ స్పష్టంగా తెలుసు అని వ్యాఖ్యానించారు. తిరుమల తిరుపతి దేవస్థానాలు వంటి పవిత్ర సంస్థల ప్రతిష్ఠను దెబ్బతీయడానికి వైసీపీ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు ఎప్పటికీ క్షమించరని మంత్రి హెచ్చరించారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని ఒప్పుకున్న వాస్తవం నుంచి తప్పించుకునే ప్రయత్నాలు ఎంత చేసినా నిజం దాగదని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# తాడువాయిలో ఘనంగా భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి కళ్యాణం




## భారీగా భక్తులకు అన్న సమారాధన

## మూడో రోజు స్వామి దర్శించుకున్న భక్తులు

**జంగారెడ్డిగూడెం -జయ జయహే**

స్థానిక మండలం లోని తాడువాయి గ్రామంలో స్వయంభువు లైన భద్రకాళి సమేత వీరేశ్వర స్వామివారి కళ్యాణం కనుల పండుగగాజరిగింది.మూడో రోజు మంగళవారం దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పునూతల పుల్లారావు, ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ చేతుల మీదగా దేవస్థానం వద్ద ఏర్పాటుచేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తిరుణాళ్ళు మూడవరోజు కావటం వల్ల అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పునూతల పుల్లారావు మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా బుధ గురువారాల్లో దేవస్థానం వద్ద పూజా కార్యక్రమాలు జరుగుతాయని నాలుగో రోజు బుధవారం అనంత ఈశ్వర స్వామి కళ్యాణం జరుగుతుందని, గురువారం ఐదవ రోజు తో మహాశివరాత్రి ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామిని దర్శించాలని కోరారు. ఆలయం వద్ద రాత్రి సమయంలో వినోద సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని భక్తులు తిలకించాలని కోరారు. కార్యక్రమంలో పిన్నమనేని నాని, కొడవటి సత్తిరాజు, ఎంపీటీసీ పొడపాటి నందిని, సర్పంచ్ యరమల సత్యవతి కొడవటి వెంకటేశ్వరరావు, పాపోలు వెంకట శ్రీనివాస్, ఉప్పునూతల శ్రీను, కాసారపు వెంకటరమణ, కాసారపు నారాయణ, పొన్నగంటి మహి, పాల్గొన్నారు. దేవస్థానం వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించగా జంగారెడ్డిగూడెం సీఐ ఎం వి సుభాష్, ఎస్సై వీరప్రసాద్, పోలీస్ సిబ్బంది సహకారం అందించారని కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.



# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి

## మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

## 250 మందికి పీజీటీలుగా పదోన్నతి

## అంబేద్కర్ గురుకులాల టీచర్ లకు ప్రమోషన్లు

## కూటమి ప్రభుత్వంకు కృతజ్ఞతలు తెలిపిన టీచర్స్

**విశాఖపట్నం, ఫిబ్రవరి 17, జయ జయహే:**

విద్యార్థుల సంక్షేమంతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. రాష్ట్రంలోని అంబేద్కర్ గురుకులాల్లో పనిచేస్తున్న 250 మంది ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ లకు పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్ గా ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రమోషన్లు కల్పించింది. ఈ సంధర్భంగా ప్రమోషన్లు పొందిన ఉఫాధ్యాయులు మంగళవారం నాడు విశాఖలో మంత్రి డివిస్ బీవీ స్వామిని కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి స్వామికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంధర్భంగా మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ...కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమంతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంది. విద్యార్థుల విద్య, ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. రాష్ట్రంలోని అన్ని అంబేద్కర్ గురుకులాల్లో విద్యార్థులు ఐఐటీ, నీట్ లో సీట్లు సాధించేలా వారిని తీర్చిదిద్దాలి. అమ్మ నాన్నల ప్రేమకు దూరంగా ఉంటూ హాస్టళ్లలో ఉండి చదుకుంటున్న విద్యార్థులను ఉఫాధ్యాయులు సొంత పిల్లల్లా చూసుకోవాలని మంత్రి చెప్పారు. పేద విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి లక్ష్యానికి అనుగుణంగా ఉపాధ్యాయులు పేద పిల్లల్ని ప్రయోజకులుగా తీర్చిద్దాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు.




# కూటమితో బీసీలకు లబ్ధి

## బీసీలకు బడ్జెట్లో అధిక కేటాయింపులు

## సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ లకు కృతజ్ఞతలు తెలిపిన వంశీ కృష్ణ

**విశాఖపట్నం, ఫిబ్రవరి 17, జయ జయహే:**

రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న బీసీలకు అభివృద్ధి జరిగితే ఈ రాష్ట్ర అభివృద్ధి జరిగినట్టుగా భావించాలని విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీ కృష్ణ అన్నారు. గత ప్రభుత్వంలో బీసీ కార్పొరేషన్ పెట్టి కనీసం బీసీలకు తీవ్ర నిరాశ ఎదురైందన్నారు. ఈ మేరకు మంగళవారం అసెంబ్లీ లో మాటాడుతూ మొన్న బడ్జెట్ కేటాయింపుల్లో కూడా బీసీలకు సింహభాగం కల్పించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, మంత్రి లోకేష్ కి ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. అలాగే స్వర్ణకారులకు కార్పొరేషన్ , గీత కార్మికులకు మద్యం దుకాణాల కేటాయింపులలో 10శాతం రిజర్వేషన్ కల్పించేందుకు నాయి బ్రాహ్మణ సోదరులకు ,చేనేత కార్మికులకు విద్యుత్తులో రాయితీ కల్పించినందుకు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గత టిడిపి ప్రభుత్వంలో కొన్ని బీసీ లకు కొన్ని ప్రత్యేకంగా కొన్ని పథకాలు అమలు చేశారని , వాటిని ప్రస్తుత గవర్నర్ ప్రభుత్వ అమలు తీరుపై అదేవిధంగా ఆదరణ పథకం సంబంధించిన అంశాలకు సంబంధించిన వివరాలపై మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. 56 బీసీ కార్పొరేటర్ కు సంబంధించిన నిధులు మంజూరు సంబంధించిన అంశాల గురించి, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ద్వారా రాయితీలు, లోన్లు సంబంధించిన అంశాల గురించి, నిరుద్యోగులకు మేలు కలిగే ఎంబీసీ, ఎఫ్ బి సి కారు లోన్ సంబంధించి అంశాలు సంబంధించిన అంశలతో పాటు ,బీసీలకు రాయితీలు, లబ్ది చేకూరే అంశాలుకు సంబంధించిన వివరాలపై చర్చించారు .




# ఆకట్టుకున్న ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ప్రదర్శన

**మాడుగుల ఫిబ్రవరి 17 జయ జయహే**

మాడుగుల మండలం కింతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం క్రాఫ్ట్ అండ్ ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. మాడుగుల మండలంలో గల అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకొని వారి ప్రతిభ పాటవాలకు అనుగుణంగా ఆర్ట్ క్రాఫ్ట్ చిత్రాలు రూపొందించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్ ప్రభాకర్ సిబ్బంది ముఖ్యంగా ఈ పాఠశాల ఆర్ట్, క్రాఫ్ట్ టీచర్స్, ఎలుగుల గంగాధరరావు, మజ్జి గంగభవాని తదితరులు పాల్గొన్నారు. వేస్ట్ మెటీరియల్ తో ఉపయోగ పడే మంచి అందాన్నిచ్చే వస్తువులు తయారు చెయ్యాలని గ్రామ సర్పంచ్ మైచర్ల సన్యాసినాయుడు ముఖ్య అతిధిగా విచ్చేసి విద్యార్థులు ని ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమశీలో గ్రామ పెద్దలు స్థానికులు విద్యార్థులు పాల్గొని ప్రదర్శన తిలకించారు.

For a pure tomorrow.. జయహో

# మైనారిటీలంటే జగన్‌కు చిత్తశుద్ధి లేదు

**సొంత జిల్లాలో కడప హజ్ హౌస్ కు ఒక్క పైసా ఇవ్వలేదు**

**మైనారిటీల పట్ల జగన్ వ్యవహార శైలిపై విరుచుకుపడ్డ మంత్రి ఫరూక్**

**అమరావతి ఫిబ్రవరి17 (జయ జయహే )**



మైనారిటీలంటే జగన్ కు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ విరుచుకుపడ్డారు. సొంత జిల్లా కడపలో హజ్ హౌస్ నిర్మాణానికి టిడిపి ప్రభుత్వ హయాంలో రూ. 25 కోట్లు మంజూరు చేసి,రూ.13 కోట్లతో భవన నిర్మాణం, సౌకర్యాలు ఏర్పాటు చేస్తే.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ పెండింగ్ పనుల పూర్తికి ఒక పైసా కూడా విదల్చలేదని మంత్రి ఎద్దేవా చేశారు. మంగళవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో హజ్ హౌస్ నిర్మాణం, హజ్ యాత్రికులకు ఏర్పాట్లపై గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అడిగిన ప్రశ్నకు మంత్రి ఫరూక్ సమాధానం ఇచ్చారు.

**హైదరాబాద్ హజ్ హౌస్ నిర్మాణం ఇతర రాష్ట్రాలకు ఆదర్శం**

ఉమ్మడి ఏపీలో హైదరాబాద్ నడిబొడ్డున ప్రత్యేకంగా జీవో ఇచ్చి, అసెంబ్లీలో పాస్ చేసి పదకొండు అంతస్తులతో ముంబైలో ఉన్న సెంట్రల్ హజ్ హౌస్ కు ధీటుగా చంద్రబాబు నేతృత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా హజ్ హౌస్ నిర్మించడం, సకల సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అప్పట్లో హైదరాబాదులో ఎంబార్కేషన్ సెంటర్ ఉండేది కాదని, అప్పటి ప్రధాని వాజ్ పేయి గారితో మాట్లాడి,ప్రత్యేక అపాయింట్మెంట్ ఇప్పించి, జస్వంత్ సింగ్ గారిని పిలిపించి కేవలం పది నిమిషాల వ్యవధిలో ఎంబార్కేషన్ సెంటర్ మంజూరు చేయించిన చంద్రబాబు నాయుడు గారి చిత్తశుద్ధి, మైనారిటీ పట్ల ఉన్న నిబద్ధత ను మంత్రి ఫరూక్ గుర్తు చేశారు. నిష్ణాతులైన ఆర్కిటెక్ లతో ప్లాన్ రూపొందించి నిర్మించిన హైదరాబాద్ హజ్ హౌస్ ను ఆదర్శంగా తీసుకొని ఇతర రాష్ట్రాల్లో హజ్ హౌస్ ల నిర్మాణాలు ప్రారంభించారన్నారు.

**జగన్ వ్యవహార శైలిపై ధ్వజమెత్తిన మంత్రి**


రాష్ట్రం విడిపోయిన సందర్భంలో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం హజ్ హౌస్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి ఫరూక్ అన్నారు.అందుకు అనుగుణంగానే కడప జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు జిల్లా కేంద్రమైన కడపలో హజ్ హౌస్ నిర్మాణానికి చంద్రబాబు రూ. 25 కోట్లు మంజూరు చేశారన్నారు.రూ.13 కోట్లు ఖర్చు చేసి భవన నిర్మాణం, ఇతర పనులు చేసినప్పటికీ, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ తన సొంత జిల్లాలో హజ్ హౌస్ పెండింగ్ పనుల పూర్తికి ఒక్క రూపాయి కూడా విదల్చలేదని మంత్రి ఎద్దేవా చేశారు. జగన్ ఆ జిల్లా వాసి కాదా..? మైనారిటీలు అంటే ప్రేమ ఉండాలి కదా..? పులివెందులలో కూడా ముస్లిం మైనారిటీలు చాలామంది ఉన్నారు..! కదా..కానీ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క పని కూడా చేయలేదని మంత్రి ఫరూక్ ఘాటుగా స్పష్టం చేశారు. హజ్ భవనంలో కరోనా పేషెంట్లను తీసుకొచ్చి అందులో పెట్టారే తప్ప ఏ మాత్రం అభివృద్ధి చెయ్యలేదని, దీన్నిబట్టి మైనారిటీల పట్ల జగన్ వైఖరి, ఎంత ప్రేమ ఉందో స్పష్టం అవుతున్నదని మంత్రి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కడప హజ్ హౌస్ ను పూర్తి చేసే బాధ్యత తిరిగి మనమీదే పడిందని, చంద్రబాబు హామీ ఇచ్చారని మంత్రి పేర్కొన్నారు.



## కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గర్భిణీలు, రోగులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ

**గోకవరం జయ జయ హేప్రతినిధి**

విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు చేపట్టిన ప్రజా సేవ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఇందులో ముఖ్యంగా రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ కార్యక్రమం ఒకటి. సుమారుగా రెండేళ్ల నుంచి గోకవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో గర్భిణీలు, అక్కడికి చికిత్స కోసం వచ్చే రోగులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రతి మంగళవారం పండ్లు, పాలు, రొట్టెలను కంబాల శ్రీనివాసరావు ఉచితంగా అందజేస్తున్నారు. ఈ మంగళవారం కూడా యధావిధిగా రామసేన సిబ్బంది వీరబాబు, సూర్య ప్రకాష్, గర్భిణీలు, రోగులకు పాలు, పండ్లు, రొట్టెలను పంపిణీ చేసారు. తన సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంటాయని, తన వద్దకు కష్టం అని వచ్చిన వారికి, లేదనకుండా సహాయం చేసి తిరిగి పంపిస్తున్నానని, కంబాల శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్త కేబుల్ రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు



## సంచలనం రేపిన మదనపల్లి ఘటన

**బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడిన హోంమంత్రి**

**కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక**

**(జయ జయహే )**

మదనపల్లిలో జరిగిన దారుణ ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన చాలా బాధాకరమని పేర్కొంటూ, బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడినట్లు వెల్లడించారు. ఘటనకు సంబంధించి ముందుగా ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియాలో తనను ట్యాగ్ చేశారని అనిత తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నట్లు చెప్పారు. ప్రాథమిక విచారణలో ముద్దాయి డ్రగ్స్ లేదా గంజాయి సేవించలేదని, అయితే మితిమీరిన మద్యం సేవించినట్లు గుర్తించామని వెల్లడించారు. మొదట బాలిక అదృశ్యమై ఉండవచ్చని అనుకున్నామని, కానీ స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు విచారణ చేపట్టి బాలిక మృతదేహాన్ని ఆమె ఇంటి ఎదురుగా గుర్తించారని తెలిపారు. నిందితుడిని తమకు అప్పగించాలని స్థానికులు ఆందోళనకు దిగారని హోంమంత్రి చెప్పారు. అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉండటంతో, విచారణకు ఆటంకం కలగకుండా బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టంకి రలించారు. అలాగే నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అతడు బెయిల్‌పై బయటకు రాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఇటువంటి ఘటనలపై తమ ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరిస్తోందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. కాగా, మదనపల్లిలో చిన్నారి హత్య కేసు ఉద్రిక్తతకు దారి తీసింది. చిన్నారి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తీసుకెళ్లేందుకు పోలీసులు చేస్తున్న ప్రయత్నాలను స్థానికులు అడ్డుకుంటూ ఆందోళనకు దిగారు. నిందితుడిని తమకు అప్పగించాలని, లేకపోతే ఎన్‌కౌంటర్ చేయాలంటూ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు..

## ఇతర దేశాల ఆదేశాలు ఇక్కడ పనిచేయవు

**బంగ్లా సార్వభౌమాధికారంలో వేలుపెట్టనీయం**

**భారత్ లక్ష్యంగా విమర్శలు చేసిన యూనస్**

**(జయ జయహే )**




బంగ్లాదేశ్‌లో రాడికల్ శక్తులకు సహాయం చేయడం, మైనారిటీ హిందువులను రక్షించడంలో విఫలమయ్యారని విమర్శలు ఎదుర్కొంటున్న బంగ్లా తాత్కాలిక పాలకుడు మహ్మద్ యూనస్ దిగిపోతూ భారత్‌పై తన అక్కసును వెళ్లగక్కారు. భారతదేశ సార్వభౌమాధికారాన్ని ధిక్కరిస్తూ, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. 2024లో హసీనా తన పదవికి రాజీనామా చేసి, భారత్ పారిపోయి వచ్చిన తర్వాత యూనస్ అధికారం చేపట్టి బంగ్లాలో భారత వ్యతిరేకతను పెంచి పోషించాడు. తాజాగా ఆయన చేసిన ప్రసంగంలో భారత్‌పై తన వ్యతిరేకతను వెల్లడించారు. విదేశాంగ విధానంలో బంగ్లాదేశ్ సార్వభౌమాధికారం, గౌరవం, స్వాతంత్ర్యాన్ని తిరిగి పొందిందని, ఇకపై ఇతర దేశాల ఆదేశాలపై పనిచేయదని చెప్పారు. భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటూ ఈ వ్యాఖ్యలు చేశాడు. భూటాన్, నేపాల్, 'సెవెన్ సిస్టర్స్'తో బంగ్లాదేశ్ అపారమైన ఆర్థిక సామర్థ్యాన్ని కలిగి ఉందని చెప్పారు. భారతదేశంలోని అంతర్భాగమైన 7 ఈశాన్య రాష్ట్రాలను ఉద్దేశించి యూనస్ ఈ వ్యాఖ్యలు చేశారు. తన హయాంలో చైనా, జపాన్, యూఎస్ఏ, యూరప్‌తో బంగ్లా సంబంధాలను పెంచానని, భారతదేశ వ్యూహాత్మక 'సిలిగురి కారిడార్'కు సమీపంలోని తీస్తా నదిపై చైనా సహాయంతో ప్రాజెక్టులు కడుతున్నామని చెప్పారు. ఇదే కాకుండా బంగ్లాదేశ్ సైన్యాన్ని విదేశాల దురాక్రమణను ఎదుర్కోవడానికి బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. ఇది భారత్‌ను ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యగా పరిగణిస్తున్నారు. తాజాగా జరిగిన బంగ్లాదేశ్ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) సంచలన విజయం సాధించింది. ఆ పార్టీ అధ్యక్షుడు తారిఖ్ రెహ్మాన్, బంగ్లాదేశ్ ప్రధానిగా 17న ప్రమాణస్వీకారం చేశారు. అయితే, దిగిపోతూ కూడా యూనస్ తన భారత వ్యతిరేకతను దాచుకోలేదు. పరోక్షంగా భారత్‌తో బంగ్లా సంబంధాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారు.

## మాటలకందని కలంతో తియ్యని రచనలు

**పాత్రికేయ విమర్శకుడు, కళా ప్రోత్సాహకుడు స్వర్గీయ భట్టిప్రోలు మధుసూధనరావు 40వ వర్ధంతి**

**భీమవరం : (జయ జయహే )**



మాటలకందని మధుశ్రీ రచనలతో చరిత్రకెక్కిన పాత్రికేయ విమర్శకుడు, కళా ప్రోత్సాహకుడు స్వర్గీయ భట్టిప్రోలు మధుసూధనరావు. మధుసూధనరావు 1986 ఫిబ్రవరి 18న తుది శ్వాస విడిచారు. భీమవరంలో భట్టిప్రోలు మధుసూధనరావు 40వ వర్ధంతి సందర్భంగా పలువురు వక్తలు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మధుశ్రీ పేరుతో ఆయన ఎన్నో రచనలు రాశారని, మధుశ్రీకలం పేరుతో సినీ రంగానికి అయన సుపరిచితులన్నారు. 1965లో ఫిలిం జర్నలిస్ట్ గాను, భీమవరం ఫిలిం ఫ్యాన్స్ అసోసియేషన్ కార్యదర్శిగాను, రాష్ట్ర ఫిలిం ఫ్యాన్స్ ఉపాధ్యక్షుడిగా, భీమవరం ప్రెస్ క్లబ్ కోశాధికారిగా, అంకాల ఆర్ట్స్ అకాడమీ, శ్రీరామరాజ భూషణ సాహిత్య పరిషత్ కార్యవర్గ సభ్యునిగా అనేక పదవుల్లో పని చేశారని, 1965లో రాష్ట్ర ఫిలిం ఫ్యాన్స్ మహాసభలు భీమవరంలో నిర్వహించారన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు బొండా రాంబాబు మాట్లాడుతూ ఆయనకు సినిమా జర్నలిజం అంటే మక్కువ అని, సినిమా జర్నలిజానికి మధుశ్రీ చేసిన కృషికి విజయవాడ ఫిలిం ఛాంబర్ అసోసియేషన్ ఘనంగా సన్మించిందన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి ప్రధానిగా ఉన్న సమయంలో యస్ డిఎఫ్ తరపున నందమూరి తారక రామారావు బృందంతో తన అసోసియేషన్ ద్వారా భీమవరం నుండి 1,116 విరాళాన్ని సేకరించిన మహామనీషి భట్టిప్రోలు అని అన్నారు. కారుమూరి భాస్కరరావు మాట్లాడుతూ ప్రసిద్ధ దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు, మధుర గాయకుడు ఘంటసాల వంటి ప్రముఖులను భీమవరం తీసుకువచ్చి తమ సంస్థ ద్వారా సన్మానించేవారన్నారు. ప్రముఖ గాయకుడు పీఠాపురం నాగేశ్వరరావుకు ఆంధ్రా రఫీ అనే బిరుదుతో సత్కరించారని, భీమవరంలో కురిశేటి వారి వ్యాపారసంస్థల్లో మూడు దశాబ్దాలపాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారని వారి సేవలను, వారిలాగే వారి కుమారుడు భట్టిప్రోలు శ్రీనివాసరావు నిర్వహిస్తున్నారు అని కొనియాడారు.

## అసోంలో కాంగ్రెస్‌కు షాక్

**మాజీ అధ్యక్షుడు భూపెన్ బోరా రాజీనామా**

**బిజెపిలో చేరేందుకు రంగం సిద్ధం**

**జయ జయహే:**

అస్సాం ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. అస్సాం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు భూపెన్ బోరా రాజీనామా రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఈ పరిణామం తర్వాత అస్సాం సీఎం, బీజేపీ నేత హిమంత బిశ్వ శర్మ, బోరాను వ్యక్తిగతంగా కలువనున్నట్లు ప్రకటించారు. బోరా రాజీనామాపై హిమంత మాట్లాడుతూ.. భూపెన్ బోరా అస్సాం కాంగ్రెస్ లో అట్టడుగు స్థానం నుంచి ఎదిగిన ప్రముఖ హిందూ నేత. ఆయన ఆహ్వానం మేరకు ఈ సాయంత్రం ఆయనను కలవనున్నాను. బీజేపీలో ఆయన చేరితే అస్సాం, దేశ సేవలో మరింత బలం చేకూరుతుందని అన్నారు. అస్సాం కాంగ్రెస్ చీఫ్‌గా గౌరవ్ గొగోయ్ బాధ్యతలు తీసుకునే ముందు 2021-25 వరకు అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడిగా బోరా పనిచేశారు. ప్రస్తుతం, అస్సాం కాంగ్రెస్‌లో గొగోయ్ ఆధిపత్య ధోరణి కారణంగానే బోరా రాజీనామా చేశారనే వార్తలు వినిపిస్తున్నాయి. బోరా తన రాజీనామా లేఖను కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పంపారు. 32 ఏళ్లగా పార్టీ కోసం పనిచేస్తున్నా, ఇప్పుడు విస్మరించారని, తనకు తగిన గౌరవం కల్పించలేదని ఆయన ఆరోపించారు. బోరా రాజీనామా ద్వారా కాంగ్రెస్‌లో సాధారణ వ్యక్తి అభివృద్ధి చెందలేదనే సందేశాన్ని పంపిందని, బోరాను బీజేపీలోకి స్వాగతిస్తున్నామని, బీజేపీలో చేరాలని నిర్ణయించుకుంటే ఆయనకు సురక్షిత స్థానం నుంచి ఎన్నికయ్యేలా చేస్తామని హిమంత చెప్పారు. సీఎం హిమంత తనను కలుస్తాననే వ్యాఖ్యలపై బోరా స్పందిస్తూ.. ఏ ముఖ్యమంత్రి అయినా తన ఇంటికి వస్తే అది తనకు గర్వకారణం అని బోరా అన్నారు. ఇదిలా ఉంటే, రాజీనామాపై పునరాలోచన చేయాలని గొగోయ్, ఎంపీ ప్రద్యుత్ బోర్దొలోయ్, దేబబ్రత సైకియాతో పాటు పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు కోరారు.

## జేఈఈ మెయిన్స్‌లో 210 మంది శ్రీ విశ్వ విజేతలే

**ఉత్తరాంధ్రలోనే అత్యధిక పర్సంటైల్ సాధన**

**విజేతలను అభినందించిన ఛైర్మన్ ధనరాజు**

**విశాఖపట్నం, ఫిబ్రవరి 17, జయ జయహే:**



విశాఖ కేంద్రం గా ఉన్న శ్రీ విశ్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు జేఈఈ మెయిన్స్లో విజయ భేరి మోగించారు. ఉత్తరాంధ్రలోనే అత్యధిక పర్సంటైల్ తో తమ విద్యార్థులు విజయజేతనం ఎగురవేశారని శ్రీ విశ్వ విద్యా సంస్థల డైరెక్టర్ పి. సూర్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ శ్రీ విశ్వ విద్యాలయంనకు చెందిన వి. మధు సూర్య సాయి శంకర్ 99.67, నీ భవదీష్ 99.65, ఎం. తృణయాని 99.51. డి. దేవ మణికంఠ 99.49, కె. హరి సరణ్ 99.12. వి. యశ్వంత్ 99 పర్సంటైల్లో విజయం సాధించారని పేర్కొన్నారు. 99 పర్సంటైల్ పైగా సాధించిన వారు 6 మంది, 98 పైన సాధించిన వారు 28 మంది. 97 పైన సాధించిన వారు 43 మంది విద్యార్థులు ఈ ఘనత సాధించినట్టు వెల్లడించారు. జనవరి సెషన్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో శ్రీ విశ్వ విద్యా సంస్థల ఛైర్మన్ కె. ధనరాజు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక, కార్యాలయ సిబ్బందిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత ర్యాంకులు సాధించేందుకు కృషి చేయాల్సిందిగా పిలుపునిచ్చారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com